Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 05.09.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com


## సుదూర తీరాలకు తెలుగు దస్తూరి

## తెలుగింటి లోగిళ్ళ.. 'బొమ్మల కొలువు' బాపు

12లో..



## రాజధాని ...విజయవాడే




- చంద్రబాబు ఏకపక్ష ప్రకటన
- చర్చ లేకుండానే పక్షపాత నిర్ణయం
- విజయవాడ పై మమకారం
- మిగిలిన జిల్లాలకు కొరివికారం
- రాష్ట్ర విభజనలో యూపిఏ చేసిన తప్పే రాజధాని ఎంపికలో చంద్రబాబు చేసాడు

ప్రతిపక్షాల గొంతునొక్కి, పార్లమెంటు తలుపులు మూసేసి, అడ్డొచ్చిన ఎంపీలను చావబాదించి ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయించి గత యూపిఏ ప్రభుత్వం లోక్‌సభలో రాష్ట్ర విభజన బిల్లును ఆమోదింపజేసింది. ఈ సంఘటనపై ఆరోజు దేశ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అదొక చీకటి దినంగా మిగిలిపోయింది. ఈ చర్యను నిరసించిన వారిలో ఆరోజు తెలుగుదేశం అధినేత, ఈరోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు కూడా ఉన్నారు.

కాని ఇప్పుడు ఆ సంఘటనను విమర్శించే అర్హతను ఆయన కోల్పోయారు. రాష్ట్ర విభజన విషయంలో గత యూపిఏ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందో, ఇప్పుడు రాష్ట్ర రాజధాని ఎంపిక విషయంలో తెలుగు దేశం ప్రభుత్వం అంతే దుర్మార్గంగా వ్యవహరించింది.

అసెంబ్లీలో రాజధానిపై చర్చ జరగకుండా, కనీసం శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను పట్టించుకోకుండా (మిగతా 12వ పేజీలో)




'లాయర్' కోసం బాపు గీసిన బొమ్మ

## 'దేశం' దాడి... జగన్‌లో తగ్గని వేడి



అసెంబ్లీ సమావేశాల్లో వైకాపా నేత జగన్‌ను టార్గెట్ చేసుకుని అధికార తెలుగుదేశంపార్టీ సభ్యులు పదేపదే దాడి చేశారు. జగన్ ప్రజాసమస్యలను లేవనెత్తితే తెలుగుదేశం సభ్యులు మాత్రం ఆయనపై ఉన్న కేసులను, జైలుకు పోవడాన్ని, వై.యస్. పరిపాలనను ఎత్తి చూపుతూ ఎదురుదాడికి దిగారు. అధికారపక్షం ఎక్కడ కూడా అసెంబ్లీలో ఒక్క పద్ధతి ప్రకారం వ్యవహరించ లేదు. జగన్‌ను టార్గెట్‌గా చేసుకున్నారు. ఆయనను బలహీనపరచి, వైకాపా శ్రేణులను విచ్ఛిన్నం చేయాలనేది తెలుగుదేశం నాయకుల పన్నాగం.

కాని జగన్ ఎక్కడా తగ్గలేదు. తలవంచలేదు. మాటకు మాట సమాధానం చెప్పాడు. తెలుగుదేశంకు అనుకూల మీడియా ప్రభుత్వం గురించి ఆహాఓహో అని ప్రచారం చేస్తున్నా అసెంబ్లీ సమావేశాలను (మిగతా 12వ పేజీలో)









## నెల్లూరు చిన్నారులకు లాయర్ కానుక...?

వివరాలు వచ్చేవారం

# రూపు మార్చనున్న రహదారి

జిల్లాలో ఇప్పటికే మూడు జాతీయ రహదారులున్నాయి. చెన్నై-కలకత్తా జాతీయ రహదారితో పాటు నెల్లూరు-ముంబై, నాయుడుపేట-పూతలపట్టులు జాతీయ రహదారులుగా ఉన్నాయి. ఎన్‌హెచ్5ను ఆరులైన్లుగా మారుస్తుండగా, ముంబైరోడ్డు, పూతలపట్టు రోడ్లను నాలుగులైన్లుగా మార్చాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. తాజాగా జిల్లా మీదుగా మరో జాతీయ రహదారి పోనుంది. చిత్తూరుజిల్లా ఏర్పేడు నుండి నల్గొండ జిల్లా నకిరేకల్ వరకు చెన్నై-బెంగుళూరు హైవేలను కలుపుతూ కొత్త జాతీయ రహదారి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొదటి దశలో ఏర్పేడు నుండి మన జిల్లాలోని పెంచలకోన వరకు ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. 209కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణాన్ని కెవిఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మొదలు పెట్టింది. గ్రామాలలో 15మీటర్లు, గ్రామాలకు వెలుపల 10మీటర్ల వెడల్పుతో ఈ రహదారి నిర్మాణం పనులను చేపడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి రాపూరు పరిసరాలలో ఇప్పటికే క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ రహదారి పూర్తయితే జిల్లాలోని మెట్టప్రాంత వాసులకు తిరుపతి, హైదరాబాద్ ప్రయాణాలు సులువవుతాయి.

# మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరుజిల్లా చిట్టమూరు మండలం మల్లాంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 4న విఘ్నేశ్వరపూజతో అంకురార్పణ, 5న ధ్వజావరోహణం, 8న ఫలాభిషేకం, నందిసేవ, 9న రథోత్సవం, 10న షణ్ముఖస్వామి కళ్యాణం, 11న కళ్యాణ రాయభారం, 12న కళ్యాణం, 13న వసంతోత్సవం, 14న అలకలతోపు, 15న ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి తెలిపారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

**జక్కా వెంకయ్య**

నెల్లూరుజిల్లా కొండాపురం మండలం చింతలదేవి పశుగణాభివృద్ధి క్షేత్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు, మాజీఎమ్మెల్యే జక్కా వెంకయ్య అన్నారు. చింతలదేవిలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చింతలదేవిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైతే ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లోని సరిహద్దుల్లో ఉండే వెనుకబడిన 13మండలాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లా రైతాంగానికి కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్థానిక రాజకీయపార్టీల నాయకులను కలుపుకుని పోరాడాలన్నారు. చింతలదేవిలో అన్ని సౌకర్యాలు అనుకూలంగా ఉన్నాయని, సిపిఎం ఆధ్వర్యంలో జరగబోయే భవిష్యత్తు ప్రజాఉద్యమాలకు తోడ్పాటునందించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాజగోపాల్, సిఐటియు జిల్లా నాయకుడు శ్రీరాములు, సిపిఎం డివిజన్ కార్యదర్శి వెంకయ్యలు విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తే కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు.

● నకిలీ మద్యం

# నిగ్గుతేలేది ఎప్పుడు?



గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నకిలీ మద్యాన్ని సరఫరా చేసినట్లు తెలినా పోటీచేసిన అభ్యర్థులపై కేసులు నమోదు చేయక పోవడం రాజకీయ దుమారం రేపుతోంది. ఎక్సైజ్ అధికారులు స్థానిక నాయకులపై కేసులు నమోదు చేసి, అసలు సూత్ర దారులు, నేతలపై కేసులు నమోదు చేయడం, అరెస్టు చేయడంలో వెనుకంజ వేయడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. జిల్లాలో నకిలీ మద్యం కేసుల దర్యాప్తు సిఐడికి అప్పగించారు. నెల్లూరు జిల్లాలో సిఐడి డిఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేకబృందం విచారణ జరుపుతోంది. జిల్లాలో నకిలీ మద్యం సరఫ రాతో పలువురు శాసన సభ్యులకు, వైకాపా నాయకులకు సంబంధం వున్నట్లు ఆరో పణలు వస్తున్నాయి.

ఈ విషయంపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శాసనసభలో ప్రకటించినప్పటికి, ఎమ్మెల్యేలు ఎవరనేది పేర్లు వెల్లడించకపోవడం విశేషం. నకిలీ మద్యం కేసులు నమోదై 3నెలలు గడిచినా ఇంతవరకు చెప్పుకోదగ్గ పురోగతి లేక పోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల ముందు విచ్చలవిడిగా నకిలీ మద్యం సరఫరా చేసి పలువురు ప్రాణాలు కోల్పోయేందుకు కారణమైన విషయం తెలిసిందే! తమిళనాడు, కర్ణాటక, గోవా తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున జిల్లాకు నకిలీ మద్యం సరఫరా జరిగింది. పలు ప్రాంతాల్లో పట్టుబడింది. ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం సిఐడితో విచారణ జరిపించాలని నిర్ణయించింది. ఈ విషయంపై ఎక్సైజ్‌శాఖలో ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసినా అసలు సూత్రధారులను కనిపెట్టడంలో, అరెస్టు చేయడంలో ఎక్సైజ్ పోలీసులు విఫల మయ్యారన్న విమర్శలు వినవస్తున్నాయి.

జిల్లాలోని అల్లూరు మండలం సమీపంలో అడవుల్లో మద్యం సీసాలు లభించాయి. కొన్ని దహనం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. ముత్తుకూరులో చెరువులో పాతిపెట్టిన మద్యాన్ని ప్రొక్లైన్‌లతో వెలికి తీశారు. పల్లెపాడుదిన్నె, నేలటూరు, పైనాపురం గ్రామాల్లో మద్యం సీసాలు లభించాయి. కావలిలో గౌరవరం, సర్వాయపాలెంలో నకిలీ మద్యాన్ని పట్టుకున్నారు. గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలంలో చింతవరం, తూర్పుకనుపూరు గ్రామాల్లో భారీగా మద్యం సీసాలు లభించాయి. ఆయా నియోజకవర్గ వైకాపా నేతలకు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. ఎమ్మెల్యేల పాత్ర వుందని తెలుగుదేశంపార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఏ విచారణకైనా సిద్ధమని వైకాపా ఎమ్మెల్యేలు సవాల్ చేస్తున్నారు.

ప్రస్తుతం ఆయా కేసులకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ స్టేషన్ల నుంచి సిఐడికి అప్పగించినట్లు సిఐలు తెలిపారు. విచారణ జరుగుతున్నట్లు డిఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొంటున్నారు.

సింహపురి సమాచారం

# 17 నుండి వెంకటగిరి పోలేరమ్మ జాతర

నెల్లూరుజిల్లాలోని వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఈ నెల 17, 18తేదీల్లో జరగనుంది. వెంకటగిరి పట్టణంలో పోలేరమ్మ జాతర చాటింపు సందర్భంగా ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఎర్ర బంగారం స్వాధీనం

నెల్లూరుజిల్లా గండిపాళెం వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు వెంబడించి వాహనంతో పాటు 39ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

ఆదివారం తెల్లవారుజామున సీతారామపురం మండలం బసినేనిపల్లి వైపు నుంచి టాటా సూపర్ ఏస్ వాహనంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నారన్న సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ రెహమాన్, కానిస్టేబుళ్ళు రవి, శ్రీనాథ్‌లతో పాటు హోంగార్డులు జావెద్, ఫరోజ్‌లతో కలిసి కృష్ణంపల్లిలో నిఘా వుంచి ఎర్రచందనం దుంగలతో వచ్చిన వాహనాన్ని గండిపాళెం సమీపంలో పట్టుకున్నారు.

# రాలని చినుకు.. రైతుల్లో వణుకు!

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా వుండడంతో, పంట పొలాలకు అదునులో సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. ఆగస్టు నెల ముగిసినా వాన చినుకుల జాడ కానరాకపోడంతో 31 మండలాల్లోని రైతన్నల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. సేద్యం కోసం పెద్ద మొత్తాల్లో చేసిన అప్పులు ఈ పరిస్థితుల్లో తీర్చగలమో లేదోనని రైతులు భయాందోళనలతో వణికిపోతున్నారు. పంటలు పండకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కంటతడిపెడుతున్నారు. వర్షాభావం కారణంగా జిల్లాలో 27 శాతం దాకా వర్షపాతం తగ్గిపోవడం, ఇక కేవలం నెల రోజుల్లోనే ఖరీఫ్ సీజన్ ముగిసిపోతున్నా నేటికీ వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం రైతులను తీవ్ర ఆవేదనకు, ఆందోళనకూ గురిచేస్తోంది. జిల్లాలోని 46 మండలాల్లో ఓ నాలుగైదు మండలాల్లో మినహా మిగిలిన మండలాలన్నింటిలోనూ ఇదే దుస్థితి.

గత ఏడాది ఇదే ఖరీఫ్ సీజన్‌లో జూన్, జులై, ఆగస్టు నెలల్లో 230 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైతే, ఈ ఏడాది ఇప్పటిదాకా ఈ నెలల్లో కేవలం 157 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇటీవల అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండడం సంతోషదాయకమే కానీ, ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో వానలు లేక అధికశాతం పంటపొలాలు ఎండిపోయాయి. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా జిల్లాలో 90వేల హెక్టార్లకు పైగానే పంటలు సాగుచేస్తుంటారు. కానీ, ఈసారి వర్షాలు కురవని కారణంగా 57 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులో వున్నాయి. అవి కూడా డెల్టా ప్రాంతంలోనే ఎక్కువ.



● జిల్లాపై కమ్ముకుంటున్న కరువు నీడలు
● బీళ్ళుగానే మిగిలిపోతున్న పంటపొలాలు
● అధికశాతం మండలాల్లో తీవ్ర వర్షాభావం

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా పండే వరి పంట ఈసారి గణనీయంగా తగ్గిపోయింది. పండ్ల తోటలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయి. అప్పోసప్పో చేసి, పెద్దమొత్తంలో డబ్బు తెచ్చి పెట్టుబడులుగా పెట్టి, ఆరుగాలం కష్టపడి సేద్యం చేసినా చివరికి పంట చేతికి అందేదాకా నమ్మకం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఉదయగిరి, సీతారామపురం, అనంతసాగరం, అనుమసముద్రంపేట, వింజమూరు, కలిగిరి, వెంకటగిరి, దక్కిలి, రాపూరు తదితర మండలాల్లోని మెట్ట ప్రాంత రైతాంగం పడే అవస్థలు వర్ణనాతీతంగా వున్నాయి. జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సెప్టెంబర్‌తో ఖరీఫ్ ముగుస్తుంది. ఆగస్టు నెల ముగిసినా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక పోవడం రైతులకు అశనిపాతమైంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు, బావుల కింద సాగుచేసుకునే పంటలకు కూడా నీరందక ఆ పొలాలు బీళ్ళుగానే మారిపోయాయి. చెరువులు దొరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో, ఆయా చెరువుల ఆయకట్టు కింద వున్న పొలాలు ఎండిపోతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో ప్రధానంగా వరి, వేరుశెనగ పంటలతో పాటు చెరుకు, పొద్దుతిరుగుడు, మినుము, మొక్కజొన్న, సజ్జ, రాగి, కంది, నువ్వులు తదితర పంటలు సాగుచేస్తుంటారు. వర్షాభావంతో ఈసారి వాటి విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఈ ప్రాంతాల్లో అధికశాతం భూములు బీళ్ళుగానే మిగిలిపోతున్నాయి. అనేక మండలాల్లో పంటలు, పండ్ల తోటలు సాగునీరు లేక ఎండుముఖం పట్టివున్నాయి.

ఇదిలావుంటే, గూడూరు, వెంకటగిరి, రాపూరు తదితర మండలాల్లో నిమ్మ, మామిడి తోటలు విస్తారంగా వున్నాయి. అయితే, వానలు లేకపోగా అప్పుడప్పుడూ వీచే ఈదురుగాలులతో తోటల్లోని కాయలన్నీ నేలపాలై రైతులకు కన్నీళ్ళనే మిగిలిస్తున్నాయి. సాగునీరందక నిమ్మతోటలు, మామిడితోటల రైతులకు ఈసారి నష్టాలే తగులుతున్నాయి... కష్టాలే మిగులుతున్నాయి.. పెన్నా నది ఒడ్డునే వున్న వేలాది ఎకరాల్లో వరి పంటను ప్రధానంగా వేస్తారు. డెల్టాలో ఖరీఫ్ పరిస్థితి బాగానే వున్నప్పటికీ, అదునుకు వర్షాలు లేకపోవడం కొంత ఇబ్బందిగా మారింది. నెల్లూరు డెల్టా ప్రాంత మండలాల్లో వరి పంట ప్రధానంగా వున్నప్పటికీ నెల్లూరు రూరల్, కోవూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో చెరుకు, అరటి తోటలు, తమలపాకు తోటలు కూడా విస్తారంగా వున్నాయి. పండ్లతోటలు, కూరగాయల తోటలు, ఆకు తోటలు, పూలతోటలు విస్తారంగా వుండే డెల్టా ప్రాంతంలోనూ ఈసారి వర్షాభావం కారణంగా ఆశించిన దిగుబడులు రావడం లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా ఈ పరిస్థితులను పరిశీలించాల్సివుంది. పంట పొలాలకు సాగునీరు అందించేందుకు వెంటనే తగు ఏర్పాట్లు చేసి, ఇప్పటికే నష్టాల పాలైన మెట్ట ప్రాంత రైతులకు చేయూతనందించాల్సి వుంది.



● జంప్ జిలాని

# రాజమోహన్‌రెడ్డి బిజెపిలోకి వెళ్తాడా..?

వాస్తవానికి జిల్లాలో పార్టీకి నాయకత్వం వహించి ముందుకు నడిపించేంత సీన్ మేకపాటికి లేదు. జగన్ స్నేహబాంధవ్యంతో కొడుకు గౌతంకి, ఆయనకు తండ్రి అనే గౌరవంతో రాజమోహన్‌రెడ్డికీ పార్టీ పెద్దరికాన్ని అప్ప జెప్పాడు. జిల్లాలో గెలిచిన ఏడు స్థానాల్లో ఒక్క ఆత్మకూరు తప్ప మిగిలిన అన్ని స్థానాల్లోనూ అక్కడ స్థానిక నేతల బలం, వైయస్సార్ పై ప్రజలకున్న అభిమానమే పార్టీకి అండగా నిలిచింది. మూడులక్షల మెజార్టీతో గెలిచిన యం.పి. 15వేలకు పడిపోయాడంటే ఆయన పరపతి ఏ స్థాయికి దిగజారిపోయిందో మనం ఊహించుకోవచ్చు.

ప్రస్తుతం మేకపాటి బారి నుండి పార్టీని రక్షించే పనిలో వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ అడుగులు వేసింది. ముందుగా మేకపాటి ఆశీస్సులతో అధ్యక్షస్థానంలో కూర్చున్న మేరిగ మురళిని ఇంటికి పంపించింది. మొన్న జరిగిన ఎన్నికల్లో మేకపాటి పుణ్యఫలంగా ఓడిపోయిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి జిల్లా పార్టీ బాధ్యతలు అప్పజెప్పింది. రాష్ట్ర పార్టీలో నెల్లూరోడైన విజయసాయిరెడ్డికి చోటు కల్పించింది.

ఈ పరిణామాలతో మనస్తాపం చెందిన మేకపాటి కుటుంబం బీజేపీలో చేరడానికి మొగ్గుచూపుతున్నట్లు రాజకీయ వర్గాల విశ్లేషణ. తన ఓటమికి తమ కుటుంబమే కారణమని సోదరుడు సైతం అక్కడా ఇక్కడా మాట్లాడుతుం డడం రాజమోహన్‌రెడ్డి మనసుకి కష్టం కలిగినట్లు కూడా చెప్తున్నారు. ఎవరు ఏ గూటికి చేరినా మరో నాలుగేళ్ళు రాజకీయ సందడి తక్కువగానే వుంటుంది. భవిష్యత్తులో ఏ పార్టీ ఏ పార్టీకి అండగా నిలుస్తుందో ఎవరు ఎవరి పొత్తుతో ప్రభుత్వాల్ని ఏర్పాటు చేస్తారో చెప్పలేని స్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ పూర్తిగా మట్టికరచిపోవడంతో రాష్ట్రంలో మిగిలివున్న రెండు ప్రాంతీయ పార్టీలతో బీజేపీ భవిష్యత్తులో ఎవరికి సహాయం చేస్తుందో ఎవరి సహాయం కోరుతుందో వేచిచూడాలి.

మొత్తానికి రాజమోహన్‌రెడ్డి మాత్రం బిజెపికి వెళ్ళడం ఖాయమని ఆయన అనుచరులే చెప్తున్నారు.

అవుననే అంటున్నాయి. రాజకీయవర్గాలు. ఆయనకు, ఆయన కొడుకుకి జిల్లా పెత్తనం ఇచ్చినందుకు సొంత తమ్ముడిని కూడా గెలిపించుకోలేక పోయాడన్న అపవాదు, ఆయన టిక్కెట్టిప్పించి బలపరచిన ఏకైక వ్యక్తి అజీజ్ తెలుగుదేశంలోకి దూకేశాడన్న నేరం ఇప్పుడు మేకపాటిపైన పడ్డాయి. మేకపాటి అనుమతి తీసుకుని ఆయన ఆశీస్సులతోనే అజీజ్ పార్టీ మారా డన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం.

రాజకీయ జోక్యం అధికంగా ఉండేది. అధికారుల బదిలీలకు ఖచ్చితంగా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల అవసరముండేది. ఇక విలువైన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అధికారుల నుండి లక్షలకు లక్షలు లంచాలు దండుకున్న నాయకమహానుభావులు కూడా ఉన్నారు.

చంద్రబాబు వచ్చాక ఈ పరిస్థితులు మారుతాయని, అన్ని ప్రభుత్వ వ్యవస్థలు కూడా దారిలోకి వస్తాయని అందరూ ఆశించారు. కాని ఇప్పుడు ఆయన తీరు చూస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీనే అనుసరిస్తున్నట్లుగా ఉంది. జీరోబేస్డ్ సీనియార్టీ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ఎటువంటి నిబంధన లతో పనిలేకుండా ఏ పోస్ట్‌లో వున్న వారి నైనా ఇప్పటికిప్పుడు బదిలీ చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అధికారపార్టీ నాయకులకు ఓ వరంగా మారింది. తమకు నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం అధికారులు ఆయాశాఖల మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళ చుట్టూ తిరుగుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పలుకుబడి వున్నవారి అనుచరులు అధికారులతో బేరాలు కుదుర్చుకుంటూ మీరు కోరుకున్న చోటికి బదిలీ చేయిస్తామంటూ ప్రలోభపెడు తున్నారు. ఆయా ప్రాంతాల్లో పోస్టింగ్‌లకు రేట్లు కూడా నిర్ణయించారు. ముఖ్యంగా పోలీసు, అటవీ, రెవెన్యూశాఖల్లో బదిలీ లకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

# పైసలు కొట్టు... పోస్టు పట్టు

చంద్రబాబు వస్తే అడ్మినిస్ట్రేషన్ బాగుంటుందని చాలామంది భావించారు. ఆ కోణంలో ఆలోచించి మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి ఓట్లేసిన వాళ్లు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వివిధశాఖలు దెబ్బతిన్నాయి. ఉద్యోగుల పోస్టింగ్, బదిలీలలో

# "మిస్ వాషింగ్టన్ జూనియర్‌టీన్"

## టైటిల్ గెలుచుకున్న 'స్వరాత్మిక'

### ఈ అమ్మాయి ఆనం సంజీవరెడ్డి మునిమనుమరాలు



జిల్లాలో "ఆనం" కుటుంబం అంటే తెలియని వారు లేరు. రాష్ట్రంలో కూడా "ఆనం" పేరు వినని వారు వుండరు. రాజకీయంగా వారు అంతటి ఘనులు.

ఆనం సోదరులలో ఒకరైన కీ॥శే॥ ఆనం సంజీవరెడ్డి(ఆనం చెంచు రంగారెడ్డి కుమారుడు) మునిమనుమరాలు స్వరాత్మిక అమెరికాలోని వాషింగ్టన్‌లో తన ప్రతిభను చాటుతోంది. సంజీవరెడ్డి కుమార్తె కూతురు గౌరి-గోపాల్‌రెడ్డిల ముద్దుల తనయ స్వరాత్మిక. ఈ ఘటికురాలి వయస్సు 14సంవత్సరాలు. కేవలం అంద చందాలలోనే కాకుండా తన మేధస్సుతో ఆమె "మిస్ వాషింగ్టన్ జూనియర్ టీన్" టైటిల్‌ని స్వంతం చేసుకుంది.

ఈ టైటిల్ కోసం 91మంది తలపడగా 4 విభాగాలలో 7మంది జడ్జీలు నిర్వహించిన అన్ని పోటీలలో స్వరాత్మిక అగ్రస్థానంలో నిలిచింది. వాషింగ్టన్‌లోని 'టకోమా'లో జరిగిన ఈ పోటీలో ముందు వరుసలో నిలిచి తెలుగువారి సత్తా చాటింది స్వరాత్మిక.

స్వరాత్మిక తండ్రి గోపాల్ కాకివాయి మైక్రోసాఫ్ట్‌లో కార్పొరేట్ విభాగం వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేస్తుండగా ఆమె తల్లి గౌరి గృహిణి. 8వ తరగతి పూర్తి చేసుకుని 9లో అడుగుపెడుతున్న స్వరాత్మిక కాకివాయి భవిష్యత్‌లో మరెన్నో విజయాలను సాధించాలని ఆశిద్దాం.

# ఆనంద ప్రాంగణం – ఆతిథ్య తోరణం

***నెల్లూరులో అనపల్లి అశోక్‌రెడ్డి రెండు కొత్త సంస్థలను ఒకేసారి ప్రారంభించి జిల్లావాసులకు కానుకగా అందించారు. ఏ శుభకార్యానికైనా అనువైన రీతిలో నిర్మించిన "అనపల్లి కన్వెన్షన్ సెంటర్" మొదటిది కాగా తక్కువ ఖర్చుతో ఎక్కువ వసతులు అందించే బడ్జెట్ హోటల్ "సీజన్స్ ఇన్" రెండవది. ఈ రెండింటినీ ఎలాంటి ఆర్భాటాలూ లేకుండా ప్రారంభించి సేవలు మొదలుపెట్టారు.***

## నెల్లూరోళ్ళకు ఒకేసారి రెండు వైభోగాలనందించాడు అనపల్లి అశోక్‌రెడ్డి



### అనపల్లి కన్వెన్షన్ సెంటర్..

నెల్లూరు నుండి రాజుపాలెం వెళ్ళే 4లైన్ల జాతీయ రహదారిలో కోవూరు శివార్లలో సుమారు 8 1/2 యకరాల విస్తీర్ణంలో అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌ని నిర్మించాడు. ఈ కన్వెన్షన్ సెంటర్‌లో ఒక్కొక్కటి 15000 అడుగుల కార్పెట్ ఏరియా కలిగిన రెండు హాళ్ళను నిర్మించి ఒకటి శుభకార్యాల కోసం, రెండవది డైనింగ్ కోసం ఉపయోగించేలా రూపొందించారు. చిన్నపాటి పెళ్ళిళ్లైతే ఒకేసారి రెండు హాల్స్‌లో రెండు కల్యాణాలు చేసుకునే వీలుగా కూడా వీటిని నిర్మించారు. ఒక్కో హాలులో 2500 మంది ఒకేసారి కూర్చుని కార్యక్రమాలను వీక్షించవచ్చు. ఆహ్లాదభరితమైన మూడు ఓపెన్‌ఎయిర్ గార్డెన్‌లను కూడా సిద్ధం చేశారు. ఒక్కొక్కటి పదివేల చదరపు అడుగులతో రెండు పెద్ద గార్డెన్‌లతో పాటు 5000 అడుగులతో ఒక చిన్న గార్డెన్ కూడా అందుబాటులో వుంచారు. సుమారు 500కార్లు పార్కింగ్ చేసుకునే వసతితో పాటు ట్రాఫిక్ అవరోధాలను అధిగమించడం కోసం ఇన్‌గేట్, అవుట్‌గేట్‌లను వేరువేరుగా ఏర్పాటు చేసి అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

వేడుక జరిగే మెయిన్ హాలుకు సైతం ఎంట్రీ, ఎగ్జిట్‌లతో రెండు పోర్టికోలను ఏర్పాటు చేసి కొత్తదనాన్ని పరిచయం చేశారు. ఇక్కడ శుభకార్యాలను చేసుకునే వారి సౌకర్యార్థం 6 రూములను సిద్ధం చేశారు.

చిన్నసైజు బర్త్‌డే వేడుక నుండి 2500 నుండి 5వేల మంది దాకా పాల్గొనే పెద్ద కార్యక్రమం వరకూ అందరికీ అందుబాటులో తమ కన్వెన్షన్ సెంటర్‌ను అందంగా రూపొందించినట్లు అనపల్లి అశోక్‌రెడ్డి చెప్పారు.




### సీజన్స్ ఇన్..

నెల్లూరు నగరం దర్గామిట్టలోని పోలీస్ ఆఫీస్‌రోడ్డు(మాగుంట సుబ్బ రామరెడ్డి మార్గ్)లో 3 నక్షత్రాల వసతులతో అతితక్కువ టారిఫ్‌లతో సీజన్స్ ఇన్ హోటల్‌ని కూడా అశోక్‌రెడ్డి ఇదే సమయంలో ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 48 రూములలో 12రూములను "స్వీట్ రూము"లుగా తీర్చిదిద్దారు. మొట్ట మొదటిసారిగా రూఫ్‌టాప్ బ్యాంక్వెట్ హాల్‌ను ఏర్పాటు చేసి చుట్టూ అద్దాలను ఏర్పాటుచేసి ఆధునిక పద్ధతిలో ఆకర్షణ తీసుకొచ్చారు.

విశాలమైన కారిడార్‌లతో పాటు ఎక్కువ సంఖ్యలో కార్లను పార్కింగ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించారు.

తర్ఫీదు పొందిన హౌస్‌కీపింగ్, రూమ్ సర్వీస్ సిబ్బందిని నియమించడంతో పాటు 3000చదరపు అడుగులతో మల్టీక్యూసైన్ రెస్టారెంట్‌ను కూడా ప్రారంభించనున్నారు. నగరం నడిబొడ్డున తాము ప్రారంభించిన సీజన్స్ ఇన్‌లో వసతులలో మూడు నక్షత్రాల హోటల్‌ను మరపిస్తామని, ధరలు మాత్రం సామాన్యుడికి సైతం అందుబాటులో వుంటాయని అశోక్‌రెడ్డి చెప్తున్నారు.

తక్కువ వ్యయంతో ఎక్కువ వసతులను నెల్లూరీయులకు అందించాలనే సంకల్పంతో తాము ఈ రెండు సంస్థలను అందించామని, పూర్తిగా వ్యాపార దృక్పథంతో కాకుండా పుట్టిన గడ్డపై అందరికీ అందుబాటులో వుండే సంస్థలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతోనే అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌తో పాటు సీజన్స్‌ఇన్‌ను స్థాపించామని, నెల్లూరీయు లందరూ ఈ రెండు సంస్థలను ఆదరించి ఆనందిస్తారని ఆశిస్తున్నానని అశోక్‌రెడ్డి చెప్పారు.

వ్యాపారరీత్యా చెన్నైలో వుంటూనే నెల్లూరులో జరిగే అన్ని కార్యక్రమాలకు హాజరౌతూ కోవూరు అశోక్‌రెడ్డిగా పేరు పొందిన అనపల్లి అశోక్‌రెడ్డి నెల్లూరీయుల కోసం అందించిన ఈ రెండు సంస్థలూ విజయపథంలో నడవాలని ఆకాంక్షిద్దాం!



# 'ప్రభా'తం

భారత ప్రధాని నరేంద్రమోడీ జపాన్ పర్యటన ఫలవంతమైంది. ఆశించిన లక్ష్యాలను సాధిస్తూ ఆయన పర్యటన ఆసాంతం ఉత్సాహంగా కొనసాగింది. జపాన్ ప్రధాని షింజో అబేతో టోక్యోలో ఈ నెల 1న జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య వున్న సంబంధ బాంధవ్యాలను మరింత పెంపొందించుకునేలా తమ అభిప్రాయాలను, ఆలోచనలను సవివరంగా స్పష్టం చేశారు. జపాన్ ప్రధాని కూడా మోడీ అభిప్రాయాలతో ఏకీభవించి, భారత్‌లో వివిధ రంగాల అభ్యున్నతికి తమవంతు చేయూతను అందిస్తామని ప్రకటించడం హర్షదాయకం. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య రక్షణ, కాలుష్య రహిత ఇంధనం, రోడ్లు, ఆరోగ్యం, మహిళాసంక్షేమం రంగాల్లో అయిదు ఒప్పందాలు కుదరడం సంతోషకరమైన అంశం. ప్రధాని మోడీ సూచించిన ప్రణాళికలను జపాన్ ఆమోదిస్తూ, ఆ మేరకు తమ మద్దతు ప్రకటించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే బడ్జెట్‌లో భారత్‌లో తమ ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను అక్షరాలా రెండు లక్షలా పదివేల కోట్ల రూపాయలకు పెంచడానికి జపాన్ అంగీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని తన ప్రసంగంలో ప్రపంచశాంతికి, భద్రతకు అటు అభివృద్ధిచెందిన భారత్, ఇటు సుసంపన్నమైన జపాన్ అత్యవసరమని అన్నారు.



## ఫలవంతమైన పర్యటన

*ప్రధాని మోడీ జపాన్ పర్యటనలో భారత్ పురోభివృద్ధికోసం చేసిన పలు ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడం హర్షించదగిన అంశం. వివిధ రంగాల అభివృద్ధికి సంబంధించిన చర్చలు పురోగతి సాధించడం ఇరు దేశాల మైత్రీభావ ప్రయాణంలో ఒక ముందడుగేనని చెప్పవచ్చు.*

జపాన్-భారత్‌లు ప్రజాస్వామ్య దేశాలే కాకుండా, ఆసియాలోని మూడు అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో అంతర్భాగమని అంటూ, 21వ శతాబ్దాన్ని ఆసియా శతాబ్దంగా అభివర్ణిస్తున్నారని, ఇది భారత్-జపాన్‌ల మధ్య పరస్పర సహకారంపై ఆధారపడి మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. భారత్‌లో గంగానది ప్రక్షాళన, వారణాసి వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల పునరుద్ధరణకు కూడా జపాన్ సహకారం అందిస్తుందని జపాన్ ప్రధాని చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, భారత్ పట్ల జపాన్ ప్రధానికి వున్న గౌరవానికి ఇది నిదర్శనమంటూ కొనియాడారు. బుల్లెట్ ట్రైన్ల విషయంలో భారతదేశానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని కూడా జపాన్ అందించేందుకు సుముఖత వ్యక్తం చేయడాన్ని మన ప్రధాని సంతోషంతో స్వాగతించారు.

ప్రధాని ప్రసంగం ఆద్యంతం జపాన్ నేతలను, ప్రజలను బాగా ఆకట్టుకుంది. అంతేకాదు, ప్రధాని మోడీ తన ప్రసంగంలో వికాసవాదంతోనే అభివృద్ధి సాధ్యమని, విస్తరణవాదం అభివృద్ధికి కొనేరదంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించడం అందరినీ ఆకర్షించింది. ఇతర దేశాల సరిహద్దులను ఆక్రమించుకోవడం, ఇతరుల సముద్ర జలాల్లోకి ప్రవేశించడం వంటి వాటిని విమర్శిస్తూ, మనకు అభివృద్ధికి బాటలు వేసే వికాసవాదం కావాలా?.. లేకపోతే విచ్ఛిన్నతకు దారితీసే విస్తరణవాదం కావాలా?.. అనేది మనమే నిశ్చయించుకోవాలని ప్రధాని అనడం అందరిలోనూ ఆలోచనలు రేకెత్తించింది. బుద్ధుడు చూపించిన మార్గాన్ని అనుసరించేవారు వికాసవాదాన్ని నమ్ముకుని ప్రగతిని సాధిస్తారని, అయితే 18వ శతాబ్దపు ఆలోచనలున్నవారు మాత్రమే ఆక్రమణలు వంటి వాటికి పాల్పడుతుంటారని ప్రధాని పేర్కొనడం కలకలం సృష్టించింది. కాగా, ఈ వ్యాఖ్యలు బహుశా చైనా తీరుపై పరోక్షంగా ఉద్దేశించినవే అయివుంటాయేమోననే ఊహాగానాలూ ఆ తర్వాత వెలువడ్డాయి.

ఏదేమైనా ప్రధాని మోడీ జపాన్ పర్యటనలో భారత్ పురోభివృద్ధికోసం చేసిన పలు ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడం హర్షించదగిన అంశం. ప్రధాని మోడీ జపాన్ పర్యటనను పురస్కరించుకుని, ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పౌర అణు ఒప్పం దానికి సంబంధించిన చర్చలు పురోగతి సాధించడం ఇరు దేశాల మైత్రీభావ ప్రయాణంలో ఒక ముందడుగేనని చెప్పవచ్చు. అదేవిధంగా, ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల్లో, భారతీయ ఆధ్యాత్మికత్వానికి ప్రతిరూపమైన వారణాసి ఇక జపాన్‌లోని క్యోటో తరహా స్మార్ట్ హెరిటేజ్‌సిటీగా రూపొందేందుకు మార్గం సుగమమైనట్లేనని భావించవచ్చు. ఆ మేరకు వారణాసి-క్యోటోల ఒప్పందంలో సంతకాలు కూడా జరిగాయి.

ఇలా ఉభయ దేశాలకు పరస్పర ప్రయోజనం చేకూర్చే సరికొత్త అధ్యాయం ప్రారంభం కావడం..ఇదో శుభపరిణామం. భారత్-జపాన్‌ల స్నేహయాత్రలో ప్రధాని మోడీ పర్యటన ఒక మేలిమి మలుపు అని భావించవచ్చు. ఇది ఒక ఫలవంతమైన పర్యటన అనే చెప్పవచ్చు.

### సేవాదృక్పథంతో...

# వైద్యసేవలు అందించడం అభినందనీయం

సేవాదృక్పథంతో 20ఏళ్ల క్రితం ట్రస్టును ప్రారంభించి వైద్యసేవలు అందించడం అభినందనీయమని నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు.

నెల్లూరులోని రాంనగర్‌లో ఉన్న శ్రీ షిరిడిసాయి రూరల్ వెల్ఫేర్ అండ్ మెడికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై విజయ హార్ట్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం జరిగిన ఉచిత గుండె వ్యాధుల శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ప్రారంభించారు. సీనియర్ కార్డియాలజిస్టు ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు 150గుండె ఆపరేషన్లు ట్రస్టు తరపున చేసినట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా॥ నరేష్ కుమార్, డా॥ వెంకటేష్, డా॥ శ్రీధర్‌రెడ్డి, డా॥ శివకుమార్, డా॥ మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా ఉంటేనే అన్ని సమస్యలు పరిష్కారం

***అనంతపురం జడ్పీ ఛైర్మెన్ చమన్***

అన్ని వర్గాలు ఐక్యంగా ఉంటేనే అన్ని సమస్యలు పరిష్కరించవచ్చని అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్మెన్ చమన్ వ్యాఖ్యానించారు. బలిజ, దళిత, మైనార్టీ, బికాస ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, అనంతపురం జడ్పీ ఛైర్మెన్ చమన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా చమన్ మాట్లాడుతూ బిసిలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది తెలుగుదేశంపార్టీయేనని, ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో స్థానం కల్పించింది దివంగత ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 54ఏళ్ల తర్వాత నెల్లూరు మేయర్‌గా మైనార్టీలకు అవకాశం వచ్చిందన్నారు. అనంతరం వీరిరువురిని కార్యక్రమ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా సంఘం నాయకులు ముఫ్తి ఇలియాజ్, కార్పొరేటర్లు వేముల మహేష్‌నాయుడు, నున్నా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### నగదు వసూలు చేస్తే...

## రక్తనిధి ఒప్పందం రద్దు చేస్తాం అంటున్న డా॥ సుధాకర్

ఆరోగ్యశ్రీ చికిత్సకు నెల్లూరు నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో రక్తానికి నగదు వసూలు చేస్తున్నట్లు రోగులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, అటువంటి ఆసుపత్రులకు రక్తనిధి ఒప్పందం రద్దు చేస్తామని రక్తనిధి కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ హెచ్చరించారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, రక్తహీనత తల్లులకు రక్తం అవసరమైతే తీసుకెళ్ళి వెంటనే రక్తాన్ని ఎక్కించాలే తప్ప ఫ్రిజ్‌లలో పెట్టరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సి.ధనుంజయ, రెడ్‌క్రాస్ సిబ్బంది ఆర్.మురళీకృష్ణ, జి.యాకోబ్, శశిధర్, బయోహజార్డ్ కంపెని ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేత్రదానం.. మరొకరికి చూపు ప్రదానం

నేత్రదానంతో మరొకరికి చూపును ప్రదానం చేయవచ్చని, మరణానంతరం ప్రతిఒక్కరూ నేత్రదానం చేసేందుకు నిర్ణయించుకోవాలని, తద్వారా అంధులకు కంటిచూపును ప్రసాదించి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి, ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ మంజులమ్మ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని, ఇటీవల నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శారదా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నేత్రదానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, విద్యార్థులకు నేత్రదానం పట్ల అవగాహన కల్పించారు. మనం మరణించినా, మన కళ్ళు మరొకరికి వెలుగుబాటలు పరుస్తాయని, కనుక నేత్రదానంలోని విశిష్టతను అందరూ అవగాహన చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

నెల్లూరుజిల్లా దక్కిలి మండలం దగ్గవోలు గ్రామంలో వినాయకుడి లడ్డు భారీ ధర పలికింది. ఈ గ్రామంలో రెండుచోట్ల స్వామివారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం స్వామివారి లడ్డు ప్రసాదాన్ని బహిరంగ వేలంపాట నిర్వహించారు. గ్రామ రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి లడ్డు ధర రూ.2.11 లక్షలు పలికింది. కొమ్మి వెంకటయ్య అనే భక్తుడు ఈ లడ్డును దక్కించుకున్నారు. పోలేరమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన లడ్డు ధర రూ.1.17 లక్షలు పలికింది. బిక్కి ప్రసాద్ ఈ లడ్డును అందుకున్నారు.

# భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోండి

రాష్ట్ర రాజధాని విషయంలో ప్రభుత్వం భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాల్సివుంది. రాజధాని ఏ ఒక్క వర్గం వారికో మేలు చేసేదిగా కాకుండా అన్ని వర్గాలకు మేలు చేసేదిలా ఉండాలి. రాజధాని విషయంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన సూచనలు, సలహాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

**తోపు సుజాత, కావలి.**

## పాక్ పీచమణచాలి

ఎన్డీఏది కాంగ్రెస్‌లా పిరికి ప్రభుత్వం కాదు. పాకిస్తాన్ పీచమణిచేలా నరేంద్ర మోడీ ధైర్యంగా వ్యవహరిస్తున్నారు. పాకిస్తాన్‌ది నక్కజిత్తుల వ్యవహారం. మనతో శాంతి చర్చలు అంటూనే సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతుంది. ఇలాంటి దేశానికి నరేంద్ర మోడీనే తగిన బుద్ధి చెప్పగలడు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**




## నల్లపరెడ్డి ఎంపిక సముచితం

వైకాపా జిల్లా అధ్యక్షులుగా సీనియర్ నాయకులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని ఎంపిక చేయడం ఎంతైనా హర్షణీయం. జిల్లాలో మేకపాటి సోదరుల పోకడల వల్ల పార్టీకి ఎంతో నష్టం కలిగింది. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకున్నందుకు సంతోషం. ప్రసన్న అనుభవం, సమర్థత పార్టీ పటిష్ట తకు దోహదపడతాయి.

**బి.ఆర్.శాలి, కావలి.**

## ఎర్రగడ్డోపాఖ్యానం

కూరలో ఎర్రగడ్డ వేయలేదని ఉగ్రుడైన ఒక హరిదాసు భార్య మీద చేయి చేసుకున్నాడు. "మీరే కదండి రాత్రి హరికథలో ఎర్రగడ్డ తినకూడదని చెప్పారు!" అన్నది భార్య. ఎర్రగడ్డ తినకూడదని వాళ్లకు చెప్పాను కానీ నీకు చెప్పానా? అన్నాడు హరిదాసు. అలా ఉంది మహిళా వస్త్రధారణను గురించి సినీనటుడు మురళీమోహన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు! మురళీమోహన్ అలాంటి సందర్భాలలో సినిమాలలో, సీరియల్స్‌లో ఎందుకు నటించారు? ఇక మీదట మురళీమోహన్ నటించే సినిమాలను, సీరియల్స్‌ను మహిళలు బహిష్కరిస్తారు. అందుకే అన్నారు చెప్పేవి శొరంగ నీతులు, దూరేది దొంగల ముఠాల్లో అని!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## తేడా కనిపించడం లేదు

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టిన జగన్ ప్రభుత్వానికి సహకరిస్తానని చెప్పారు. ఈరోజు ఆ హుందాతనాన్ని ప్రదర్శించడం లేదు. ఋణమాఫీకి సలహాలిచ్చి జగన్ తన హుందాతనాన్ని నిలబెట్టుకోవాలి. తండ్రిని అనుకరించేలా కాకుండా తన కంటూ ఓ ప్రత్యేకతను నిలబెట్టుకోవాలి.

**డి.ధర్మారావు, నెల్లూరు.**

## ధోనికి అభినందనలు

వన్డే విజయాల్లో అజారుద్దీన్‌ను దాటిన భారత క్రికెట్ జట్టు కెప్టెన్ ధోనికి అభినందనలు. ఇతర ఏ భారత కెప్టెన్లు నెలకొల్పని రికార్డును ధోని సృష్టిస్తున్నాడు. ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయినా, వన్డేల్లో పుంజుకుని సిరీస్ కైవసం చేసుకోవడం నిజంగా ధోనికే సాధ్యమైంది. ధోని ఇంకా ఎన్నో రికార్డులు బ్రేక్ చేస్తాడు.

**జి.యస్.కృష్ణ, నెల్లూరు.**



• రాజధానిగా..

# నెల్లూరు భేష్

*రాష్ట్రానికి కొత్త రాజధాని ఎంపిక రాజకీయ రంగు పులుముకుంటుండడం తెలిసిందే! రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని తీసి పక్కన పెడితే రాజధాని ఎంపికపై కేంద్రం నియమించిన శివ రామకృష్ణన్ కమిటీ నివేదికలో నెల్లూరుజిల్లాకు ప్రాధాన్యత దక్కడం విశేషం.*

రాజధానికి పరిశీలనలో నెల్లూరుజిల్లా పేరు ప్రస్తావనే రాలేదు. కాని రాజధాని ఎక్కడైతే బాగుంటుందని లోతుగా అధ్యయనం చేసిన శివరామకృష్ణన్ కమిటీ ప్రతిపాదించిన జోన్‌లలో నెల్లూరు కీలకంగా మారడం విశేషం. రాజధానికి నెల్లూరుజిల్లా అనుకూలమని శివరామకృష్ణన్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. శివరామకృష్ణన్ ప్రతిపాదనల్లో వెంకటగిరిలోని ఏర్పేడు – శ్రీకాళహస్తి ఒక భాగంగా ఉండగా కావలి – ఉదయగిరి – కందుకూరు – సింగరాయకొండ ప్రాంతాలను కూడా ప్రతిపాదించారు. ఈ రెండు జోన్‌లు కూడా నెల్లూరుజిల్లాతో ముడిపడి ఉన్నవే! నెల్లూరు కేంద్రంగానే వీటి అభివృద్ధి ఉంటుంది.

నూతన రాజధాని నిర్మాణానికి కావాల్సిన అన్ని వసతులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. శ్రీశైలం నుండి కావాల్సినన్ని నీళ్లు తెచ్చుకోవడానికి ఆస్కారముంది. జిల్లాలో కృష్ణపట్నం పోర్టుతో పాటు దుగరాజపట్నం లేదా రామాయపట్నం వద్ద మరో పోర్టు వచ్చే అవకాశం వుంది. కావలి సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ జరిగింది. అన్ని ప్రాంతాలను అనుసంధానించే విధంగా ఆరులైన్ల జాతీయ రహదారి వుంది. ఇక దేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు అనువైన రైల్వే వసతి కూడా ఉంది. అన్నింటికి మించి శివరామకృష్ణన్ కమిటీ ప్రధానంగా ప్రస్తావిస్తున్న భూసేకరణకు నెల్లూరుజిల్లాలో ఎటువంటి సమస్య లేదు. లక్ష ఎకరాల అటవీభూమి, లక్ష ఎకరాలకు పైగా బీడు భూములు కూడా అందుబాటులో వున్నాయి. చౌకగా భూములు లభించే అవకాశముంది.

ఇక శాంతిభద్రతల పరంగా చూసినా, నాగరికత, జీవనశైలి, వాతావరణం పరంగా చూసినా అందరూ ఇష్టపడే ప్రాంతం నెల్లూరు. కాకపోతే చంద్రబాబుకే నెల్లూరంటే ఇష్టం లేకుండా పోయింది. నెల్లూరు పేరు వింటేనే ఆయన మనసుకు కష్టంగా ఉంటుంది.

# పోర్టును పోగొట్టుకున్న ఘనత మనదే!



మా జిల్లాకు ఈ ప్రాజెక్ట్ రావాలంటే, మా జిల్లాకు ఈ విశ్వవిద్యాలయం కావాలంటూ ఆయా జిల్లాల నాయకులు పోటీలు పడుతున్నారు. ఎవరికివాళ్లు పలుకుబడి ఉపయోగించి తమతమ జిల్లాలకు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు సాధించుకుంటున్నారు. కాని నెల్లూరుజిల్లా నాయకులు మాత్రం ఈ కొత్త ప్రభుత్వంలో ఏమీ సాధించకపోగా గత యూపిఏ ప్రభుత్వంలో మంజూరై రాజముద్ర పడిన దుగరాజపట్నం పోర్టును మా కొద్దు మా కొద్దు అని తరిమేసారు. మాకు పోర్టు వద్దు, పర్యావరణమే ముద్దు అంటూ మేధా పాట్కర్ వారసులు మాదిరిగా వచ్చిన పోర్టును రాకుండా చేసేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో పోర్టును మన రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని భావించిన గత యూపిఏ ప్రభుత్వం అందుకు మూడు ప్రాంతాలను పరిశీలించింది. విశాఖజిల్లా నక్కలపల్లి, ప్రకాశం జిల్లా రామాయపట్నం, నెల్లూరుజిల్లా దుగరాజపట్నంలను పరిశీలనలోకి తీసుకుని అధ్యయనం చేశారు. ఈ పోర్టు నిర్మాణానికి దుగరాజపట్నమే అనుకూలమని తేలింది. దీంతో పార్లమెంటులో ఈ పోర్టు నిర్మాణం ఆమోదం పొందింది. ఈ పోర్టు నిర్మాణంపై గత యూపిఏ ప్రభుత్వం కూడా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక్కడ పోర్టు వస్తే సెక్యూరిటీ పరంగా సమస్యలు వస్తాయన్న షార్‌సెంటర్ సందేహాలను కూడా నివృత్తి చేశారు. పర్యావరణ అనుమతులు కూడా తెచ్చారు. అన్నీ సవ్యంగా జరిగివుంటే గత ప్రభుత్వంలోనే ప్రధానిగా వున్న మన్మోహన్ సింగ్ ఈ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఉండాలి. కాని ఎన్నికల కోడ్ వల్ల ఆ పని జరగలేదు.

ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరుజిల్లాపై శీతకన్ను వేశాడు. దురదృష్టమేంటంటే ఈ జిల్లాకు చెందిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు కూడా దుగరాజపట్నం పోర్టు ఇష్టం లేదు. పైపెచ్చు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు వంటి నాయకులు దుగరాజపట్నం పోర్టు వద్దంటూ, అక్కడ పర్యావరణాన్ని కాపాడాలంటూ కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు కూడా ఇచ్చారు. పర్యావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఎక్కడా ఒక పోర్టును గాని ఒక పరిశ్రమను గాని పెట్టలేరు. ఈ లెక్కన చూసుకుంటే చైనా మన కంటే ఎంతో వెనుకబడి ఉండేది. దుగరాజపట్నం వెనక్కి పోవడం వెనుక పర్యావరణ పాయింట్ ప్రధానం కాదు. చెప్పలేని కారణాలేవో ఉన్నాయి.

కొత్త... పాత...

# కలవని మనసులు

జిల్లా తెలుగుదేశం పార్టీలో సీనియర్లు, జూనియర్లు, సబ్‌జూనియర్లు అనే మూడు టీమ్‌లు ఏర్పడ్డాయి. పార్టీ పెట్టినప్పటినుండి ఉన్నోళ్లు, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎక్కడికీ పోకుండా అంటిపెట్టుకుని ఉన్నోళ్లు సీనియర్లు అయితే, ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుండి తెలుగుదేశంలోకి వచ్చినవాళ్లను జూనియర్లుగా చెప్పుకోవచ్చు. ఇక ఎన్నికల అనంతరం పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలో చేరిన వారిని సబ్‌జూనియర్లని చెప్పుకోవచ్చు. పార్టీలో ఇప్పుడు సీనియర్లు, జూనియర్ల పాత్ర నామమాత్రంగా మారింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కార్యక్రమాల్లో ఏ రోజూ ప్రత్యక్షంగా పాల్గొనని పి.నారాయణ ఈరోజు మంత్రయ్యారు. ఈరోజు జిల్లా పార్టీ వ్యవహారాలన్నీ నారాయణ చేతుల మీదుగానే జరిగిపోతున్నాయి. ఇక అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు, ఇతర వ్యవహారాలలో సిఫార్సులు అమలు కావడం వంటివన్నీ కూడా మంత్రి అనుచరుల ద్వారానే జరిగిపోతున్నాయి. వీళ్లంతా కూడా ఎన్నికల తర్వాత తెలుగుదేశంలోకి వచ్చారు. ప్రత్యేకించి వీళ్లు చెప్పిన పనులే జరుగుతుండడంతో సీనియర్ నాయకులు ఆవేదన చెందుతున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థలోనూ పరిస్థితి ఇదే విధంగా తయారై ఉండడం విశేషం.

# దువ్వూరు పద్యాలు.. అనర్ఘ రత్నాలు

## - ప్రముఖ సాహితీవేత్త బీరం సుందరరావు



ప్రముఖ సాహితీవేత్త బీరం సుందరరావును సత్కరిస్తున్న దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి నిర్వాహకులు

కవికోకిల దువ్వూరు రామిరెడ్డి రాసిన పద్యాలు ఆణిముత్యాలు..అనర్ఘ రత్నాలు అని, కవిత్వమే జీవితంగా.. జీవితమే కవిత్వంగా జీవించిన మహోన్నత కవి దువ్వూరు రామిరెడ్డి అని ప్రముఖ సాహితీవేత్త బీరం సుందరరావు కొనియాడారు. నెల్లూరులోని దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో గత నెల 30న టౌన్ హాలులో, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి 118వ జయంతి సభను నిర్వహించారు. ఈ సభలో ముఖ్య వక్తగా ప్రకాశం జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు బీరం సుందరరావు పాల్గొని, కవికోకిల కవితా వైభవాన్ని అత్యద్భుతంగా వివరించి, విజ్ఞానసమితి వారి సన్మానాన్ని అందుకున్నారు.

ఈ సందర్భంగా బీరం సుందరరావు మాట్లాడుతూ దువ్వూరు రచనలు ఎంతో విలక్షణమైనవని, విశిష్టమైనవని అన్నారు. జాతీయోద్యమ సమయంలో ప్రజలకు కర్తవ్యోపదేశం చేస్తూ 'ప్రబోధశంఖారావం' మోగించిన కవి దువ్వూరు అని ఆయన ప్రశంసించారు. తెలుగులోనే కాక, హిందీ, పారశీకం, ఉర్దూ, జర్మనీ, ఫ్రెంచ్ తదితర భాషలనూ స్వయంగా నేర్చుకుని, ఆ భాషల్లో పాండిత్యాన్ని సాధించిన గొప్ప కవి దువ్వూరు రామిరెడ్డి అని, ఇరవై ఏళ్ల చిన్న వయసులోనే దువ్వూరు 'నలజారమ్మ' వంటి అత్యద్భుత కావ్యాలు రచించి, సాహితీరంగంలో సింహపురి ఖ్యాతిని దశదిశలా రెపరెపలాడించారని ప్రస్తుతించారు. సింహపురి సీమకు చెందిన కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి రచనలు తెలుగు సారస్వత లోకంలో ఎన్నటికీ మణి మకుటాలేనని అన్నారు.

ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది, దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి అధ్యక్షులు పివి రమణారెడ్డి అధ్యక్షత వహించి, దువ్వూరు కవిత్వాన్ని, రచనల వైశిష్ట్యాన్ని వివరించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, డాక్టర్ ప్రభాకర్, ప్రముఖ సాహితీవేత్తలు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, అవనిగడ్డ కృష్ణమూర్తి లతో పాటు, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు తదితరులు పాల్గొని బీరం సుందరరావును ఘనంగా సత్కరించారు. 'జయ గణనాయక.. వినాయక'.. అంటూ గౌతమి ప్రార్థనాగీతంతో సభ ప్రారంభమైంది. దువ్వూరు విజ్ఞాన సమితి కార్యదర్శి బివి నరసింహం సభను స్వాగతించి, నిర్వహించారు.

తొలుత, ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క శిష్యబృందంచే భక్తి గీతాలాపనలు నిర్వహించారు.

# సమస్యలకు 'వారధి' పరిష్కారం

## - జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్



నెల్లూరుజిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం కొరకు "వారధి" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పోలీసు కార్యాలయంలో "వారధి" కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు చెందిన పోలీసు సిబ్బంది వారి సమస్యలను తెలియజేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రావాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై ఈ సమస్య ఉండదన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా 8500507411 నెంబరుకు ఒక్క యస్‌యంయస్ ఇస్తే వెంటనే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

# నెల్లూరును చెత్త రహితంగా తీర్చిదిద్దుతా!

## - మేయర్ అబ్దుల్ అజీజ్



నెల్లూరును చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నీరు – చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డితో కలిసి హరనాథపురం వద్ద గల చిల్డ్రన్స్ పార్కులో ఆయన మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆదాయం రూ.100కోట్లు కాగా కేవలం 37కోట్లు మాత్రమే వస్తోందని, ప్రజలందరూ పన్నులు చెల్లించాలని కోరారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు రెండు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ జాన్‌శ్యాంసన్, కార్పొరేటర్లు దారా సరోజనమ్మ, అబ్దుల్ జలీల్, పార్కు కమిటి నాయకులు శ్రీనివాసులురెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## చవితి వేడుకలకు రాని వెంకయ్య



కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్య నాయుడు ప్రతి ఏటా వినాయకచవితి వేడుకలప్పుడు నెల్లూరొచ్చేవాళ్లు. పండుగరోజు రాలేకున్నా పక్కరోజో ఆ మరుసటిరోజో వచ్చి సీమా సెంటర్, వేదాయ పాళెం సెంటర్ తదితర చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద జరిగే పూజల్లో పాల్గొనే వాళ్లు. కాని ఈసారి కేంద్రమంత్రిగా పని ఒత్తిడి ఎక్కువ కావడం, ఇటీవలే స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షి కోత్సవానికి వచ్చిపోయి వుండడంతో ఇంతలోపే మళ్లీ రాలేకపోయినట్లు తెలుస్తోంది.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు



పర్యావరణ పరిరక్షణకు, భావితరాలకు స్ఫూర్తిగా మట్టి వినాయకుల విగ్రహాలను తయారు చేయడం అభినందనీయమని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. వినాయకచవితి సందర్భంగా సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలకు కాలుష్య రహిత వినాయక ప్రతిమల పోటీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ప్రదర్శనలు తిలకించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సిఎంఆర్, చందనబ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రూపాయి నాణాలతో 12అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని తయారుచేసి ప్రదర్శనకు ఉంచామని, స్వామి వారి తయారీకి ఉపయోగించిన నాణాలను త్వరలో తమ ఖాతాదారులకు, నగర ప్రజలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ సంస్థల మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాయగుంటను అభివృద్ధి చేస్తా

**నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని మల్లాయ గుంట ప్రాంతంలో సోమవారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ మల్లాయగుంట ప్రాంతంలో నివసించే ప్రజలు పేదవాళ్ళని, వీరంతా గత మూడేళ్ళ క్రితం నెల్లూరు నగరం నడిబొడ్డున కాపురాలు ఉన్నారని, రోడ్డు విస్తరణలో భాగంగా వీరి ఇళ్ళను అప్పటి పాలకులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి ఈ అడవి ప్రాంతంలో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కుకాటి ప్రసాద్, కార్పొరేటర్ కమలరాజు సంపూర్ణ, జనార్దన్‌రెడ్డి, వంశీ, జమళ్ళ రమేష్, హరిరెడ్డి, జనార్ధన్, హరిచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విజయ లేబొరేటరీలో...

## చిన్న పిల్లల ఆసుపత్రి ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డా॥ పెంచలరెడ్డి, డా॥ విజయకుమార్‌రెడ్డి, డా॥ విజయలక్ష్మి

నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్‌రోడ్డులో ఉన్న విజయ లేబొరేటరీ ఆవరణలో ఆదివారం విజయ చిన్నపిల్లల ఆసుపత్రిని డాక్టర్ ఎం.పెంచల రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎం.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నపిల్లల ఆసుపత్రిని ప్రారంభించారన్నారు. డా॥ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విజయ ఆసుపత్రిలో చెన్నైలో అందించే నాణ్యమైన వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# సింహ(హింస)పురి రైలు వేళలు మారాయి

### నెల్లూరు నుండి రాత్రి 10.40కి - సికింద్రాబాదు నుండి రాత్రి 10.55కి

నెల్లూరు నుండి హైదరాబాదు వెళ్ళాలన్నా అట్నుంచి ఇటు రావాలన్నా ఆలస్యంగా బయలుదేరే ఏకైక రైలు సింహపురి ఎక్స్‌ప్రెస్. గూడూరులో మొన్నటి వరకూ రాత్రి 9గంటలకు బయలుదేరి నెల్లూరుకి 9.30 గంటలకు వస్తుండేది. ఇప్పుడు ఆ టైం కాస్తా అక్కడ 10.10 గంటలకు కదిలి నెల్లూరుకు 10.40గంటలకు వచ్చేలా మార్చారు. ఈ మారిన టైం ప్రకారం ఉదయం 7.45గంటలకు సికింద్రాబాద్‌కు చేరవలసిన ఈ రైలు ఇప్పుడు 8.45 నిముషాలకు చేరుతుంది. ఇక అక్కడనుండి ఇక్కడ(గూడూరు)కి వచ్చే వేళల్లో కూడా మార్పు చేశారు. గతంలో 10.30గంటలకు బయలుదేరే రైలును ఇప్పుడు 10.55 గంటలకు మార్చారు. ఉదయం 8గంటలకు నెల్లూరుకు రావలసింది ఇప్పుడు 8.34కి వస్తుంది.

అసలు సింహపురి పేరుకి సూపర్‌ఫాస్ట్ రైలే కాని ఇదెప్పుడూ టైంకి రాదు. కాక పోతే ఆలస్యంగా బయలుదేరుతుంది కాబట్టి పనులన్నీ చూసుకుని తీరిగ్గా వెళ్లొచ్చులే అనుకునే వాళ్ళకు ఈ రైలే అనుకూలం. అయితే ఈ రైలు వేళలతో విసిగిపోయిన జనం ఈ ట్రైన్‌కి సింహపురి ఎక్స్‌ప్రెస్‌కి బదులుగా హింసపురి ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టుకున్నారు. ప్రయాణీకులు పెట్టుకున్న ముద్దుపేరును సార్థకం చేస్తూ రైల్వేశాఖ వేళలు మార్చేసింది.

సెప్టెంబర్ 1వ తేదీ నుండి క్రొత్త వేళలు అమలులోకి వచ్చాయి. ఈ వేళల ప్రకారం రాత్రి 10.40కి నెల్లూరులో బయలుదేరి ఉదయం 8.35కి సికింద్రాబాదుకు చేరుతుంది. రాత్రి 10.55కి అక్కడ నుండి బయలుదేరి ఉదయం 8.34కి నెల్లూరుకు చేరుతుంది. ఇవి అసలైన సమయాలు.

వాన రాకడ... ప్రాణం పోకడ తెలియదన్నట్లుగా మరి ఈ సింహపురి రాకపోకలు ఆ దేవుడికే తెలియాలి.

## 26 నుంచి దసరా సెలవులు

నెల్లూరుజిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఉష తెలిపారు. త్రైమాసిక పరీక్షలు అక్టోబర్ 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

### విజిలెన్స్ అదనపు ఎస్పీగా

## రామప్రసాద్‌రావు

విజిలెన్స్ అదనపు ఎస్పీగా టి.రామప్రసాద్‌రావు గత నెల29న బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న సి.శశిధర్‌రాజు తెలంగాణా జిల్లాకు పోలీసుశాఖలో కేటాయింపులు జరగడంతో ఆయన హైదరాబాద్ డిజిపి కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఏడాది పాటు శశిధర్‌రాజు జిల్లా విజిలెన్స్ అదనపు ఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతపురం జిల్లా అదనపు ఎస్పీగా ఉన్న రామప్రసాద్‌రావు నెల్లూరు విజిలెన్స్ అదనపు ఎస్పీగా బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## చిన్నారుల మినీ సైన్స్‌ఫేర్



నెల్లూరు, సరస్వతీ నగర్‌లోని డా॥ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్‌లో గత నెల 30వ తేదీ చిన్నారులు గ్లోబల్ వార్మింగ్‌పై సైన్స్ ప్రాజెక్ట్‌లను నూతన పద్ధతుల్లో రూపొందించి ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అడవులు, చెట్లు నరికి వేయడం వల్ల జరిగే అనర్థాలు, కరువుకాటకాలు సంభవించినప్పుడు పరిస్థితులు, భూకంపాలు వచ్చినప్పుడు కలిగే నష్టాలు, సునామి లాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు జరిగే నష్టాలు, వాటికి సంబంధించిన సైన్స్ ప్రాజెక్టులను, చిత్రాలను, వాటి నుండి రక్షించుకోవడానికి తీసుకోవలసిన ముందుజాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డా॥ కిషోర్‌రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ పర్యావరణం, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా విద్యార్థులచే సైన్స్‌ఫేర్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, రేస్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ రేవతి, రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దళితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

నెల్లూరు నగరం స్మార్ట్‌సిటీగా రూపాంతరం చెందుతున్న దశలో జిల్లాలో 250 మందితో కూడిన దళిత గ్రాడ్యుయేట్‌లను ఎంపిక చేసి వారికి దళిత పారిశ్రామికవేత్తలుగా అవకాశం ఇవ్వాలని, నగరంలో గుర్తించిన దళితవాడల్లో మినరల్‌వాటర్ ప్లాంట్‌లను నెలకొల్పి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ దళిత పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మందాబాబ్జీ జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు వినతిపత్రం సమర్పించారు.

# నగరంలో వినాయకచవితి మహోత్సవాలు





నెల్లూరు, ట్రంకురోడ్డు శివాజీసెంటర్‌లో శివాజీసెంటర్ మిత్రమండలి ఆధ్వర్యంలో గతనెల 29వ తేదీ హైదరాబాద్‌లో తయారు చేయించి నెల్లూరుకు తీసుకొచ్చిన 16అడుగుల లక్ష్మీగణపతి భారీ విగ్రహాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపా వెంకట్ మాట్లాడుతూ వినాయకపూజలు చేయడం వల్ల ప్రజలకున్న విఘ్నాలు తొలిగి జయాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా వినాయకచవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, శివాజీ సెంటర్ నిర్వాహకులు ఆర్‌వి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 30వ తేదీ నెల్లూరు నగరం చిల్డ్రన్స్‌పార్కు వద్ద గల ఆదిత్యనగర్ వినాయకుని గుడి వద్ద నుంచి గణేష్ సందర్శన ఏకతా యాత్రను రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం ప్రారంభించారు. ఈ యాత్రలో పూజ్యశ్రీ కమలానంద భారతి స్వామీజీ, మార్కండేయ స్వామీజీ, దయానంద సరస్వతి స్వామీజీలు మూడురోజులు పాల్గొని ప్రవచనాలు, పండుగ విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాదరన్ స్కూలు అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, సామాజిక ఉద్యమ నేత పరంధామయ్య, సంఘటన కార్యదర్శి వి.శ్రీనివాస సావర్కర్, ఎస్.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరులోని అన్ని ప్రాంతాల్లో భారీ వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జె.యస్.రెడ్డి దాతృత్వంతో...

# కస్తూరిదేవి అమ్మాయిలకు యూనిఫాంల పంపిణీ





ఏ యేడాదికాయేడాది తమ ప్రతిభను చాటుకుంటూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల శ్రీ కస్తూరిదేవి విద్యాలయంలో చదువుకుంటున్న 95మంది బాలికలకు ఇటీవల ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవాతత్పరుడు జె.యస్.రెడ్డి యూనిఫాంలనందజేశారు.

గత దశాబ్దకాలం క్రితం ఈ యూనిఫాంల పంపిణీ కార్యక్రమానికి సంస్థల సెక్రటరి మరియు కరస్పాండెంట్ జె.వి.రెడ్డి శ్రీకారం చుట్టగా తొలుత కొన్ని సంవత్సరాలు బత్తిన కుమార్ స్వామిరెడ్డి చేయూతనందించారు. మరో ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు వచ్చి మూడు సంవత్సరాల పాటు అందించగా 2012 సంవత్సరంలో కోళ్ళపూడి సురేష్‌రెడ్డి, 2013లో స్వయంగా జె.వి.రెడ్డి ఈ సత్కార్యానికి పూనుకున్నారు. ఈ యేడాది ఈ పనిని జె.యస్.రెడ్డి చేపట్టి 95మంది విద్యార్థినులకు సుమారు 65వేల రూపాయల ఖర్చుతో యూనిఫాంలను అందించారు. ఈ కార్యక్రమంలో ఖైదీ చిత్ర నిర్మాత, సంయుక్త మూవీస్ అధినేత డా॥ యం.తిరుపతిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరిదేవి కమిటీ పక్షాన జె.యస్.రెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు నగర కమిషనర్‌గా ఐఏయస్?

నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా ఐఏయస్ అధికారిని నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా, మరో వైపు కమిషనర్ పోస్టుకు తీవ్రమైన పోటీ పెరిగింది. పలువురు అధికారులు నెల్లూరు కమిషనర్ కుర్చీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధికారపార్టీకి చెందిన కొంతమంది నాయకులు వర్గాలుగా చీలిపోయి కమిషనర్ నియామకంపై సిఫార్సులు చేస్తున్నారు. ప్రస్తుతం కమిషనర్ బదిలీపైనే చర్చ జరుగుతోంది. పలువురు నేతల సిఫార్సులతో రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ డోలాయమానంలో పడినట్లు సమాచారం. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏయస్ అధికారిని తీసుకురావాలని మంత్రి నారాయణ ఆలోచనగా ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత నగర జనాభా 6.50లక్షలు దాటింది. శివారు ప్రాంతాలతో కలిపి మహానగరంగా ఆవిర్భవించింది. బడ్జెట్ రూ.650కోట్లు దాటడంతో ఐఏయస్ ఉంటే పాలన గాడిన పడుతుందని మంత్రి భావిస్తున్నారు. నగరపాలక సంస్థలో వేళ్లూనుకున్న అవినీతిని పునాదులతో పెకలించే అధికారి రావాలని నగర ప్రజల ఆకాంక్ష. నెల్లూరు స్మార్టుసిటీగా మారనున్న దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో వివిధ పథకాలకు నిధులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నందున దీనికి సమర్థుడైన అధికారి కావాలని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అభిప్రాయపడుతున్నారు.



ఈ నెల 3వ తేదీన 12వ డివిజన్‌లోని రాజుపాళెం అరుంధతీయవాడలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తున్న ఆ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి

## జిల్లాలో 63 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఈ నెల 5 వ తేదీ గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 63మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశారు. ఆ మేరకు వారికి గురుపూజోత్సవం రోజున సాయంత్రం 4 గంటలకు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఇన్‌ఛార్జి డిఇఓ ఉష తెలిపారు.

# వాడవాడలా రాజన్నకు నివాళులు



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 5వ వర్థంతి కార్యక్రమాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం నెల్లూరుజిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. వైయస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. పేదలకు అన్నదానం, రక్తదానం, పండ్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు వాడవాడలా జరిగాయి. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లోని వైయస్సార్ విగ్రహం వద్ద వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారాకానాథ్, కార్పొరేటర్లు , పార్టీ కార్యకర్తలు వైయస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లోను వైయస్సార్ వర్థంతి కార్యక్రమాలు, అన్నదానం జరిగాయి. వైయస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వైయస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగు, పెనుబల్లి, రెడ్డిపాళెం, ఉదయగిరి, మండలలో దివంగత నేత విగ్రహానికి నివాళులర్పించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గంలో వైయస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 5మండలాల్లో, సూళ్ళూరుపేట, కావలి, వెంకటగిరి నియోజకవర్గాల్లో వైయస్సార్‌సిపి నాయకులు ,కార్యకర్తల ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం



నెల్లూరు జిల్లా రాపూరులో రోటరీ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ ఐ ఫౌండేషన్ ఛైర్మన్ పి.శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాపూరు కొత్త పేట మండల ప్రజాపరిషత్ హిందూ ప్రైమరీ స్కూలులో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో డా॥ఆర్‌వి సుబ్రహ్మణ్యం పాల్గొని దాదాపు 200 మంది రోగులను పరీక్షించి 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, 30 మందికి కంటి అద్దములు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోటరీ ఐ హాస్పిటల్‌లో వీరికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో రోటరీ ఐఫౌండేషన్ కార్యదర్శి యస్.రాఘవేంద్రషెట్టి అధ్యక్షులు కెవి.సుబ్రహ్మణ్యం, రోటరీక్లబ్ కార్యదర్శి యస్.విజయరామరెడ్డి, ఎన్.నారాయణ, ఐ.లక్ష్మీనారాయణ, ఎన్.ప్రకాష్‌రావు, కెవి.సుబ్బారెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుత: ॥ (గీత)



జక్కా హర్షవర్ధన్‌రెడ్డి

జననం: 04.10.1957 మరణం: 07.09.1997

# సంస్మరణ



మా అందరిలో ఒకడిగా, మాకందరికీ తోడుగా
నీవు లేని ఈ లోకం, రూపుదాల్చిన శోకం!

మా గుండెల్లో గుడి కట్టి పదిలంగా నిలిచావు.
మా హృదయాల్లో కలకాలం జీవించే ఉంటావు!!

నీ స్మృతిలో...

స్వప్న - భార్య

జె.వి.రెడ్డి - తండ్రి
జానకి - తల్లి


కుమార్తెలు - అల్లుడు
సంజన - కుషాన్
సుస్మిత

చెల్లెలు - బావ
శరణ్య - డా॥ అశోక్

మేనల్లుడు - మేనకోడలు
అస్విన్ - షీనా

మరియు
కుటుంబసభ్యులు

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు పైడా వరప్రసాద్ - పద్మమ్మల కుమార్తె **ప్రతిమ - సురేష్‌కుమార్** (విజయనగరం జిల్లా వాస్తవ్యులు స్వర్గీయ నాగుమళ్ల రామారావు - లక్ష్మీకాంతమ్మల కుమారుడు)ల వివాహం ఆగస్టు 15వ తేదీ నెల్లూరులోని రాఘవ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్త జంటకు లాయర్' అభినందనలు.

# గూడూరు డివిజన్ వార్తలు


## ఎల్ఐసి 58వ ఆవిర్భావ వేడుకలు



జ్యోతి ప్రకాశనం చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్ తదితరులు

గూడూరు పట్టణం లోని సాయినగర్‌లో ఉన్న ఎల్ఐసి కార్యాలయంలో సోమవారం 58వ ఆవిర్భావ వేడుకలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి బీమా తప్పనిసరని అన్నారు. ఎల్ఐసి సంస్థ 13దేశాల్లో సేవలను అందిస్తోందన్నారు. జీజేఎఫ్ ఫౌండేషన్ ద్వారా సామాన్య, పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్, తెలుగుదేశంపార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, మనపాటి రవీంద్రబాబు, ఎల్ఐసి అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, కె.మునిగిరీష్, ఎల్ఐసి ఎ.ఓ రమేష్‌బాబు, బి.ప్రసూన, ప్రసాద్, ఆదినారాయణ, శివకుమార్, వాకాటి రామ్మోహన్, డిఓలు శివసుబ్రహ్మణ్యం, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం



## గోవిందుడు ఎప్పుడొస్తాడో?

మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ తేజ్ నటిస్తున్న 'గోవిందుడు అందరి వాడేలే' చిత్రం దసరాకు వస్తుందనుకుని అభిమానులు ఎదురు చూస్తుంటే దీని విడుదల మాత్రం వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. ఈ చిత్రం పూర్తి కావడానికి ఇంకొంత సమయం పట్టే అవకాశం వుంది.



## ప్రజాసేవలో సమంత

మనిషన్నాక కొంత మానవసేవకు అంకితం కావాలని హీరోయిన్ సమంత భావిస్తోంది. మాటలు చెప్పడమే కాక, ఆమె దానిని ఆచరణలో కూడా చూపిస్తోంది. ఇంతకుముందు 'దేవ్‌నార్ స్కూల్ ఆఫ్ బ్లైండ్'కు లక్ష రూపాయలు విరాళం అందించిన సమంత దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడులో కాలు కోల్పోయిన ఓ యువతికి కృత్రిమ కాలు ఏర్పాటు చేయించి తన దాతృత్వం చాటుకుంది. అలాగే రోటరీ క్లబ్ వారి ద్వారా మరికొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలాగే మరికొన్ని సేవా కార్యక్రమాల నిధుల కోసం వివిధ స్వచ్ఛంధ సంస్థలు చేపడుతున్న ఈవెంట్‌లలో పాల్గొనడానికి కూడా ఆమె ఉత్సాహంగా ఉంది. హ్యాట్సాఫ్ సమంత!

## 'మంట'పెడుతున్న తమన్న



ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న 'బాహుబలి' షూటింగ్ ప్రస్తుతం మహాబలేశ్వర్‌లో జరుగుతుంది. ప్రభాస్, తమన్నలతో పాటు ప్రముఖ నటీనటులు ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇక్కడ గజగజ వణికే చలిలో మంట ద్వారా తమన్న చలి కాచుకుంటుంది. ఈ చలిలో నాకు వెచ్చదనాన్ని ఇచ్చే ఈ మంట నాకు బెస్ట్ ఫ్రెండ్ అని తమన్న ట్వీట్ చేసింది. ఈ సినిమా 2015 ఏప్రిల్‌లో విడుదల కానుంది.

## తహశీల్దార్‌గా వెంకటనారాయణమ్మ



గూడూరు మండల తహశీల్దార్‌గా వెంకట నారాయణమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి రాజకీయ ఒత్తిళ్లతో నెలక్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ఇన్‌ఛార్జిగా చిల్లకూరు తహశీల్దార్ శ్రీకాంత్‌కేధర్‌నాథ్ వ్యవహరిస్తున్నారు. తాజాగా కలెక్టరేట్‌లో పని చేస్తున్న నారాయణమ్మను నియమించారు.

## వైయస్ వర్ధంతి

గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వై.యస్.రాజశేఖర రెడ్డి వర్ధంతిని వైకాపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అశోక్‌నగర్, బినిగీసాహెబ్ పేట, సాధుపేట, గడియారం స్థంభం, ఆసుపత్రిరోడ్డులోని పాతమోతీమహల్ తదితర కూడళ్ళలోని వై.యస్. విగ్రహాలకు వైకాపా నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి ప్రాంతీయ వైద్యశాలలో వై.యస్. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాసిని నాగులు, వాటంబేటి శివకుమార్, మెట్టా రాధాకృష్ణారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, బొమ్మిడి శ్రీనివాసులు, ఇజ్రాయిల్‌కుమార్, గురవయ్య, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం లాభసాటిగా మారుస్తాం



మాట్లాడుతున్న తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డా॥ రాధాజ్యోత్స్నలత

రాష్ట్ర ప్రభుత్వం రైతులను సాగుకు ప్రోత్సహించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తోందని గూడూరు నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల రాధా జ్యోత్స్నలత తెలిపారు. గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తగా ఇసుక విధానం అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. మహిళా సంఘాలకు సహాయసహకారాలు అందించేందుకు జిల్లా పాలనాధికారి, ఎస్పీ, ఇతర ఉన్నత స్థాయి సభ్యులతో జిల్లా కో సంస్థను ఏర్పాటు చేయనున్నామన్నారు. గృహనిర్మాణ పథకంలో జియోటాగింగ్ ద్వారా అక్రమాలకు తెరపడనుందని చెప్పారు. పూర్తయిన 45లక్షల ఇళ్లతో పాటు వివిధ స్థాయిల్లో నిర్మాణాల్లో ఉన్న మరో 5లక్షల ఇళ్లను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నారన్నారు. చిత్రకారుడిగా కార్టునిస్టుగా, రచయితగా సినీ దర్శకుడిగా, తెలుగువారి సంస్కృతిలో భాగమైన బాపు అస్తమయం బాధాకరమన్నారు. ఆయన మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వాయిగండ్ల నాగరాజు, గోను శివకుమార్, శ్రీనివాసులురెడ్డి, పులిమి వెంకయ్య, బయ్యా మోహన్, నవశేఖర్, శనగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ పుస్తకాల పంపిణీ



పేద విద్యార్థులకు వాసవి క్లబ్ సరస్వతి పథకం ద్వారా మేలు జరుగుతుందని ఆ క్లబ్ గౌరవాధ్యక్షులు సోమిశెట్టి చెంచు రామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. పదేళ్లుగా సరస్వతి పథకానికి దాతగా ప్రస్తుతక్లబ్ అధ్యక్షులు గొంట్లా గురుప్రసాద్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పువ్వాడ వెంకటసుమన్, కొండా సురేష్, కొండా భాస్కర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భూములను ఆక్రమిస్తున్నారు

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను కొందరు ఆక్రమించి తమపై దౌర్జన్యం చేస్తున్నారంటూ బాధితులు ఆర్డీవో కె.శ్రీనివాసరావుకు మొరపెట్టుకొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం జరిగింది.

ఈ సందర్భంగా సైదాపురంలో సర్వే నెంబరు 780లో ఒక్కొక్కరికి 1.50ఎకరాల వంతున ముగ్గురికి 4.50ఎకరాలను డీకేటీ పట్టాలు ఇచ్చారని బాధితులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. అయితే కొందరు లీజుల పేరిట భూములను తీసుకొని వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొన్నారని ఆరోపించారు. విచారించి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. కాగా గూడూరు మండలంలోని నెర్నూరు గ్రామంలో ఇళ్ల స్థలాల్లేని వారికి స్థలాలు మంజూరు చేయాలని ఆ గ్రామస్థులు కోరారు. పక్కా ఇళ్లు స్థలాలు లేకపోవడంతో మంజూరు కాలేదని వివరించారు. ఇంకా చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని బాధితులు ఆర్డీవోను కలిసి వారి సమస్యలను వివరించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించినంత ఆదాయం ఉండదు. ఆర్థిక విషయాలలో నిర్ణయాలు తొందరపడి తీసికొనవద్దు. అవసరాలకు డబ్బు అందుతుంది. అయినవారితో విభేదాలు లేకుండా సర్దుబాటు చేసికొనండి. కుటుంబసౌఖ్యం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి ఉపాధి పథకాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరిగినా, అదనపు ఖర్చులను నిలువరింపలేకపోతారు. అనుకున్న పనులను ఉత్సాహంగా జరుపుతారు. శుభ కార్య ప్రయత్నాలు ఫలించగలవు. ఇతరులకు ధన, మాట రూపంలో సహాయపడతారు. ఉద్యోగులకు, అధికారు లకు పనిభారం పెరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనుగోలు ప్రయత్నాలు జరుగుతాయి. వృత్తి వ్యాపారములు జీవనము గల్గిన వారికి ఆదాయము అభివృద్ధి ప్రయత్నాలు సంతృప్తికరంగా ఉంటాయి. అవసరాలకు ఋణాలు చేయడం, వస్తు వాహనరిపేర్లుండవచ్చును. ప్రయత్న పూర్వకంగా లభించిన అవకాశాల వల్ల మేలు జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయముకు తగినట్లుగా ఖర్చులు సర్దుబాటు చేసికొంటారు. వ్యాపారవర్గాలకు ఆదాయవృద్ధి స్వల్పంగా ఉంటుంది. కుటుంబంలో అవగాహన లోపం వల్ల చిన్న సమస్యలుండవచ్చును. ప్రముఖులను కలుసుకొంటారు. శాస్త్ర సాంకేతిక ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, మంచి అవకాశాలుంటాయి. ఉద్యోగులు కొత్త బాధ్యతలు చేపట్టగలరు. అనుకున్న పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బంధుమిత్రుల సాయంతో కలిగిన ఇబ్బందులను దాటుతారు. ఉద్యోగులపై అధికారుల ప్రభుత్వ వత్తిడి పనిభారము ఉంటుంది. ఆదాయము సామాన్యంగా ఉండి అదనపు ఖర్చులు పెరుగుతాయి. పిల్లల వల్ల సమస్యలు రావచ్చును. ఆకర్షణీయమైన పథకాలతో వృత్తి వ్యాపారాలలో ముందుకు సాగుతారు. ఇతరుల విషయాలలో చొరబాటు చేయకండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి రాబడి సామాన్యంగా ఉంటుంది. కుటుంబఖర్చులు, దూరప్రయాణ ఖర్చులు పైన అదనం కాగలవు. పనులు జరగడానికి బాగా శ్రమ తీసికొంటారు. టెన్షన్ పడుతుంటారు. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు పనిభారం, శ్రమకు గుర్తింపు ఉంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, స్టాక్ మార్కెట్ లాభాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 05.9.2014 నుండి
తేది. 11.9.2014 వరకు

ఈ వారం కర్కాటకంలో గురువు, సింహంలో రవిశుక్రులు, కన్యలో బుధరాహువులు, తులలో శని, వృశ్చికంలో కుజుడు, మీనంలో కేతువు, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 5 శుక్రవారము ఉపాధ్యాయదినోత్సవం
తేది 9 మంగళవారము మహాలయపక్ష ప్రారంభము

#### భాద్రపద మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 05 | శుక్ర | ఏకాదశి | సా॥గం.5.33వ॥ |
| తేది. 06 | శని | ద్వాదశి | సా॥గం.3.16వ॥ |
| తేది. 07 | ఆది | త్రయోదశి | మ॥గం.12.53వ॥ |
| తేది. 08 | సోమ | చతుర్దశి | ఉ॥గం.10.25వ॥ |
| తేది. 09 | మంగళ | పూర్ణిమ | ఉ॥గం.7.56వ॥ |
| | పిదప | పాఢ్యమి | రా॥గం.5.36వ॥ |

#### భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | బుధ | విదియ | రా॥గం.3.32వ॥ |
| తేది. 11 | గురు | తదియ | రా॥గం.1.42వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, కొత్త వ్యాపార భాగస్వామ్య అవకాశాలుండగలవు. ఒప్పందాలలో నిశిత పరిశీలన అవసరం. ఆదాయ వ్యయాలు సంతృప్తికరము. బంధువర్గ ముఖ్యులకు అనారోగ్యము, కోర్టు కేసులందు కొంత ప్రతికూలత ఉంటుంది. నిర్ణయాలు చేయలేని స్థితి ఉంటుంది. ఇతరుల సహకారంతో పనులు సాగిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికస్థితి బాగుంటుంది. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కొత్త పనులు, పెట్టుబడులు జరుపుతారు. అధికారులకు బాధ్యతలు మారడం, స్థానమార్పు ఉంటుంది. తలపెట్టిన పనులు నిదానంగా జరగడం వల్ల అసహనానికి లోనుకాగలరు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి. నిర్మాణ అనుమతులు పొందుతారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు. ఋణం కాని, ఇతరచోట్ల డబ్బు సర్దుబాటు చేసికొనవలసి వస్తుంది. పరిశ్రమల యజమానులు, పెట్టుబడిదార్లకు అభివృద్ధి, అవకాశాలు బాగుంటాయి. బంధువర్గంతో వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించండి. అనుకున్న పనులను జరుపుకొంటారు. దూరప్రయాణాలుండవచ్చును.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి జీవనంకలవారికి బాగుంటుంది. వ్యాపార జీవనంలో ఒడుదుడుకులు, రాబడి సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, అనుకున్న ముఖ్య పనులు ఆలస్యం కావచ్చును. స్థిరాస్తుల విక్రయాలు, శుభకార్య నిర్ణయాలలో తొందరపడవద్దు. గృహ వస్తు వాహన రిపేర్లు ఖర్చులుంటాయి. ఆర్థికంగా నిర్ణయాలు తీసికొనవలసి వస్తే పెద్దల సలహా అవసరం కాగలదు.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబ వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. వ్యాపారవర్గాలకు అవకాశాలు ఆగిపోవడం, సహాయపడవలసిన వాళ్లు ముఖం చాటు చేయడం ఉంటుంది. ఆదాయం వృత్తి వ్యాపారాలలో తగ్గవచ్చును. శాస్త్ర సాంకేతిక రంగాలవారికి, పారిశ్రామికవేత్తలకు కొత్త ప్రాజెక్టులు లభించగలవు. బంధువర్గ ముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. శుభకార్య విషయాలపై కుటుంబవిషయాలపై దృష్టి పెడతారు.

## మీనం




పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు రావడం వల్ల టెన్షన్ ఉంటుంది. వ్యాపారవర్గాల వారు అభివృద్ధి పథకాలు ఆచరణలో పెడతారు. ఆదాయ లోపం ఉండదు. కొత్త కాంట్రాక్టులు, పెట్టుబడులకు తొందరపడవద్దు. అదనపు ఖర్చులుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను చిన్నసమస్యలను ఎదుర్కొంటారు.

# గురు సాక్షాత్.. పరబ్రహ్మా!

**సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా...**

***గురువులు మనకు ప్రత్యక్ష దైవాలు. గురువులతోనే ప్రతి ఒక్కరి భవితకూ వెలుగులు. శిశువుకు మాటలు నేర్పి, నడకలు నేర్పి, మమతానురాగాలతో లాలించి పెంచే తొలి గురువు అమ్మ. జన్మనిచ్చిన తల్లి దైవంతో సమానమైతే, తల్లి తర్వాత, బాల్య దశలోనే విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో మంచి నడవడికతో మెలిగి జీవితాలను సార్థకం చేసుకునే జ్ఞానాన్నీ.. లోకజ్ఞానాన్ని ప్రసాదించేది గురువులే. అందుకే, గురువులు దైవంతో సమానం. గురుర్బ్రహ్మా... గురుర్విష్ణుః.. గురుర్దేవో మహేశ్వరః.. గురుసాక్షాత్ పరబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః!.. అన్నట్లుగా, దైవజ్ఞానాన్ని, ఆత్మజ్ఞానాన్నీ కలిగించే గురువులు సాక్షాత్తూ ఆ భగవంతునితో సమానమే.***



అందుకే, మన పూర్వీకులు గురువులకు ఎంతో ఉన్నతమైన స్థానం కేటాయించారు. గురువులు మనకు, ఈ సమాజానికి చేసే మహోపకారానికి కృతజ్ఞతాపూర్వకంగా గురుపూజ చేయడమనే సత్సంప్రదాయం మన దేశంలో ఎంతోకాలం నుంచి వుంది. తమ శిష్యులు వేదవిద్యల్లో ప్రావీణ్యత సాధించాలని, మానవత్వంతో రాణించాలని, శాంతితత్వంతో సమాజంలో సమున్నత స్థానం సాధించడమే కాక, సమాజానికి మానవతా విలువలను ప్రబోధించాలని గురువులు భావించేవారు. శిష్యులు కూడా గురువుల బాటలో నడిచేవారు. గురువును అనునిత్యం అనుసరించేవారు. గురువు మాటంటే శిష్యునికి వేదవాక్కుగా వుండేది. గురుశిష్యుల పరస్పర అనురాగం, ఆత్మీయతలు సమాజానికెంతో ఆదర్శనీయంగా ఉండేవి. అయినా, గురువు స్వయంగా ఏ సేవలూ, ఏ ప్రతిఫలమూ ఆశించేవారు కాదు. అయినా శిష్యులు మాత్రం గురువును ఎల్లవేళలా అనుసరిస్తూ, ఆయనకు శుశ్రూషలు చేసేవారు. దైవపూజకు అవసరమైన దర్భలను గురువుకు కానుకగా తెచ్చి ఇచ్చేవారు. వాటిని చూసి గురువు ఎంతో ఆనందించేవారు. తమ శిష్యులను మనసారా ఆశీర్వదించేవారు. అప్పటికీ ఇప్పటికీ కూడా గురువులే సమాజానికి మార్గదర్శకులు. గురువు లేని విద్య సార్థకం కాదు. మనం ఎవరినుంచి అక్షరాలు నేర్చుకున్నామో, ఎవరి నుంచి జీవిత పాఠాలు నేర్చుకున్నామో, ఎవరి నుంచి జ్ఞానాన్నీ, విజ్ఞానాన్ని, లోకజ్ఞానాన్నీ ఆర్జించామో, ఎవరి మాటలతో, బోధనలతో ప్రేరణ పొంది జీవితాన్ని చక్కగా నిర్మించుకోగలిగామో...అలాంటి గురువులను విస్మరించడం మానవత్వం అనిపించుకోదు. గురువుల పట్ల అన్నివేళలా కృతజ్ఞతాభావంతో వుండడం ఒక సంస్కారం. గురువులు మనకేమి బోధించినా, అది మన శ్రేయస్సు కోసమే, మన యశస్సు కోసమేనని మరువరాదు. గురువులు చెప్పిన మాటలను అనుసరిస్తే జీవితం అన్ని విధాలుగా శ్రేయోదాయకమైన బాటలోనే సాగుతుంది. అలా కాక, మనకే అంతా తెలుసు అన్నట్లుగా మిడిమిడి జ్ఞానంతో మనకు ఇష్టం వచ్చిన రీతిలో మొండిగా ప్రవర్తిస్తే, జీవితానికో మంచి లక్ష్యం లేకుండా నిర్లక్ష్యంగా బతికేస్తే, జీవితం చివరకు అస్తవ్యస్తమైపోతుంది. కష్టాలసుడిలో కొట్టుకుపోతుంది. భారతీయ జీవన విధానంలో గురుశిష్యుల పరంపరకు విశేషమైన స్థానం వుంది. గురువులు అంటే..అంధకారమనే అజ్ఞానాన్ని తొలగించేవారు అని అర్థం. స్వార్థం, ద్వేషం వగైరాలేమీ దరి చేరనీకుండా, నిస్వార్థంతో తాము జీవిస్తూ, సమాజానికి హితవును బోధించేవారు గురువులే. సమాజాభ్యున్నతికి బాటలు వేసేది గురువులే. గురువుల దీవెనలు కేవలం విద్యార్థులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. గురువుల చల్లని దీవెనలు వుంటే జీవితం అదే మంచిమార్గంలో పయనిస్తుంది. మనందరికీ మంచిని బోధించే గురువులను ద్వేషించకూడదు. గురువులను భక్తితో పూజించాలి. దైవభక్తి, దేశభక్తి, గురుభక్తి అనేవి ప్రతి ఒక్కరికీ వుండాలి. దేవతలు సైతం గురువులను ఆరాధించేవారంటే, గురువులకు వున్న ప్రాధాన్యత ఎలాంటిదో అర్థం అవుతుంది. భారతీయ జీవన వికాసానికి ఎంతో మంది గురువులు తమ నిరుపమానమైన సేవలు అందించారు.

ఆదిశంకరాచార్యులవారు, శ్రీ రామకృష్ణ పరమహంస, వివేకానందుడు వంటి ఎందరో మహనీయులు సమాజంలో మానవత్వాన్ని మేలుకొల్పి ఆదర్శనీయులయ్యారు. వేదాలను, మహాభారత ఇతిహాసాన్ని, ఎన్నో పురాణాలను, ధర్మాలను మనకందించిన వేదవ్యాసమహర్షి జగద్గురువులుగా నేటికీ అందరి పూజలందుకుంటూనే వున్నారు. నేటి ఆధునిక కాలంలోనూ ఎందరో గురువులు తమ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నారు. విఖ్యాత విద్యావేత్త, అపార విజ్ఞాన సంపన్నుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మన దేశంలో విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. ఆయన 1962లో రాష్ట్రపతి అయినప్పుడు ఆయన శిష్యులు, సహచరులైనవారు ఆయనకు పుట్టినరోజు వేడుకలు జరపాలని నిర్ణయించుకున్నప్పుడు, నా పుట్టినరోజు వేడుకలను వేరుగా జరిపే బదులు, ఆ రోజు ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేనెంతో సంతోషిస్తాను అని చెప్పారు. ఉపాధ్యాయవృత్తి పట్ల తనకున్న ఉన్నతమైన భావనను ఆయన ఆ మాటల ద్వారా స్పష్టం చేశారు. నాటినుంచి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజైన సెప్టెంబర్ 5వ తేదిని, ఉపాధ్యాయ దినోత్సవంగా దేశవ్యాప్తంగా ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా, ఆయా ప్రాంతాల్లో భావిభారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఎందరో గురువులను గౌరవించుకుంటూ, సత్కరించుకుంటూ గురుపూజ చేసుకుంటున్నాం. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, జ్ఞానాన్ని ప్రసాదించిన గురువులను పూజించుకోవడమనేది మన పవిత్రమైన భారతదేశంలో ఒక మంచి సంప్రదాయం..ఒక మంచి సంస్కారం కూడా.

వినాయకచవితి సంబరాలు

## మక్తాపురం కోదండరాముని సన్నిధిలో...



నెల్లూరుజిల్లా సంగం మండలం మక్తాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం వద్ద వినాయకచవితి పర్వదినం సందర్భంగా సిద్ధి విఘ్నేశ్వరస్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ.శశికుమార్‌రెడ్డి పాల్గొని విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవకమిటి కార్యకర్తలు ఏ.సువర్ధన్‌రెడ్డి, పి.మనోజ్‌కుమార్, జె.సునీల్‌రెడ్డి, పి.వెంకట శేషరెడ్డి, ఏ.సుమంత్‌రెడ్డి, ఎస్.కె.కమల్‌బాషా, పి.రాజశేఖర్, ఏ.హరి, ఏ.బాబు, టి.రమేష్, సిహెచ్ శశికుమార్, కె.భక్తవత్సల్ తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ ఉట్టిమహోత్సవం, 6వ తేదీ నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామప్రజలు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## కావలి నాగసాయిబాబా సమక్షంలో...



నెల్లూరుజిల్లా కావలి పట్టణం వెంగళ రావునగర్‌లో వేంచేసియున్న శ్రీ నాగ సాయిబాబా మందిరం వద్ద శ్రీ గణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో వినాయకచవితి పర్వదినం సందర్భంగా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. 29వ తేదీ ఉదయం విగ్రహప్రతిష్ట, సాయంత్రం అళహరి సుబ్రహ్మణ్యంచే భజన కార్యక్రమాలు జరిగాయి. 30వ తేదీ ఉదయం విశేషపూజలు, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 'మనుప్రభ' ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. గాయనీగాయకులు మనుబోలు ప్రభాకరరావు, రవి, కిషోర్, ప్రవల్లిక ఆలపించిన అలనాటి పాత, కొత్త మధురగీతాలు సభికులను అలరించాయి. మనుబోలు ప్రభాకరరావు మిమిక్రీ అందరిని ఉత్తేజపరిచింది. 31వ తేదీ ఉట్టి కార్యక్రమం అనంతరం గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మూడురోజుల కార్యక్రమాలకు ఆలా శ్రీనివాసులు(విగ్రహదాత), వేమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి(అన్నదానం దాత), వై.కె.నందకిషోర్(పాటకచ్చేరి దాత), కొండేటి చిరంజీవి సుబ్రహ్మణ్యం (అలంకరణ దాత), నారా మాలకొండయ్య, తేలప్రోలు విజయప్రభాకర్(లైటింగ్ దాత), అళహరి సాయిసుమన్(లడ్డు దాత), కె.వి.పి.శివకుమార్(స్వీట్స్), అళహరి సందీప్‌కుమార్(బాణాసంచా దాత), దాసరి కిషోర్‌కుమార్‌నాయుడు (తప్పెట్లు దాత) వ్యవహరించారు. కిషోర్, శ్రీనివాసులు తదితర యువకులు పర్యవేక్షించారు.

## సౌరశక్తి వినియోగానికి...

# నెల్లూరుజిల్లా ఎంతో అనుకూలం



ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డా.జగదీష్



*దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. మన రాష్ట్రానికి సంబంధించి అనంతపురం జిల్లా రామగిరి, కడవకల్లు ప్రాంతాల్లో పవనశక్తి వినియోగంలో వుంది. నెల్లూరులోని నరసింహకొండలో కూడా రెండు పవన విద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇటీవలికాలంలో ప్రభుత్వం సౌరశక్తికి ఎంతో ప్రాముఖ్యం ఇస్తోంది. ఈ తరుణంలో అనంతపురం జిల్లాలో సౌరశక్తి కేంద్రాలు నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనంతపురం జిల్లాతో పాటు నెల్లూరుజిల్లాలో సౌరశక్తి వినియోగానికి సంబంధించిన వివరాలను పరిశీలిస్తే, నెల్లూరు కూడా అందుకు ఎంతో అనుకూలంగా వుండడం విశేషం.*

**సౌరశక్తి వినియోగానికి సంబంధించిన నెలవారీ వివరాలు**

| | |
|---|---|
| అనంతపురం | 5.22, 6.05, 6.5, 6.44, 6.07, 5.02, 4.57, 4.62, 4.93, 4.6, 4.56, 4.71, 5.27 |
| గుంటూరు | 4.66, 5.49, 6.2, 6.42, 5.92, 4.78, 4.07, 4.19, 4.47, 4.3, 4.49, 4.44, 4.95 |
| నెల్లూరు | 4.78, 5.71, 6.5, 6.61, 6.11, 5.11, 4.74, 4.81, 4.97, 4.3, 4.07, 4.19, 5.15 |

**అనంతపురం జిల్లాతో పోలిస్తే నెల్లూరు జిల్లాలో ఖాళీభూములు (వేస్ట్ ల్యాండ్స్) విస్తీర్ణం చాలా ఎక్కువ.**



రూఫ్‌టాప్(ఇంటిపైకప్పు) సోలార్ ప్యానెల్స్



గుజరాత్‌లోని నర్మదా కెనాల్‌పై సోలార్ ప్యానెల్స్

సౌరశక్తి వినియోగంలో సోలార్ ప్యానల్స్‌ను శుభ్రంగా వుంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. దీనిపైనే సౌరశక్తి ఉత్పాదన ఆధారపడివుంటుంది. సోలార్ ప్యానల్స్‌పై పడే దుమ్మును తరచూ శుభ్రం చేయకపోతే సామర్థ్యం పడిపోతుంది. ఈ ప్రక్రియలో నీటి సరఫరా ఎంతో అవసరం. ఇందుకు నెల్లూరుజిల్లాలోని పలు ప్రాంతాలు ఎంతో ఉపకరిస్తాయి.

అంతేకాకుండా, గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా కాలువపై పెట్టిన సోలార్ ప్యానల్స్ వలె మన రాష్ట్రంలో కూడా అలాంటి వాటిని నెలకొల్పాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కాలువపై పెట్టిన సౌరశక్తి వల్ల ధర అధికమే కాకుండా, నిర్వహణ కూడా శ్రమతో, ఖర్చుతో కూడినది. వేలకొలది చదరపు కిలోమీటర్ల ఖాళీ భూములు ఉన్నప్పుడు ఎక్కువ వ్యయం చేసి, ఈ కాలువలపై వాటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం అంతగా లేదు. పైగా, ఈ సౌరశక్తిని పెంపొందించేవారు చెప్తున్న కారణం, నీటి ఆవిరిని ఈ ప్యానల్స్ అరికడతాయని చెప్తున్నారు. కానీ, నది విస్తీర్ణం ఎంత?..సోలార్ ప్యానల్స్ పెట్టిన విస్తీర్ణం ఎంత అని పరిశీలించినప్పుడు ఇందులో ఎంత వాస్తవం వుందో బయట పడుతుంది. గుజరాత్ ఇప్పటికే పవనశక్తి వినియోగంలో దేశంలో 3వ స్థానంలో వుంది.

**ఆయా రాష్ట్రాల్లో పవనశక్తి వివరాలు**

| రాష్ట్రం | 31,07.2014 నాటికి సామర్థ్యం (మెగా వాట్లలో) |
|---|---|
| తమిళనాడు | 7253 |
| గుజరాత్ | 3414 |
| మహారాష్ట్ర | 4098 |
| రాజస్థాన్ | 2820 |
| కర్నాటక | 2409 |
| ఆంధ్రప్రదేశ్ | 753 |
| మధ్యప్రదేశ్ | 493.00 |
| కేరళ | 55 |
| ఇతరులు | 4.30 |
| **మొత్తం** | **21,264** |



సోలార్ ప్యానెల్స్

**ఖాళీ భూముల వివరాలు(చదరపు కిలోమీటర్లలో)**

| జిల్లా | ఖాళీభూములు | మొత్తం విస్తీర్ణం | శాతం |
|---|---|---|---|
| అనంతపురం | 3323.45 | 15130 | 16.9 |
| గుంటూరు | 1676.36 | 11391 | 14.72 |
| కర్నూలు | 3879.14 | 17658 | 21.97 |
| **నెల్లూరు** | **4918.18** | **13076** | **37.61** |

పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో 7253 మెగావాట్ల పవనశక్తి వుండగా, మన రాష్ట్రంలో కేవలం 753 మెగా వాట్లు మాత్రమే వుండడం శోచనీయం. నెల్లూరుజిల్లాలోని నరసింహకొండ, వెంకటగిరి, ఉదయగిరి, కొండప్రాంతాలు పవన శక్తి ఉత్పాదనకు ఎంతో అనుకూలంగా వున్నాయని గుర్తించాలి. అయితే, మన రాష్ట్రం పవనశక్తిలో ఎంతో వెనుకబడివుంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు తీరం నుంచి దూరంగా (ఆఫ్ షోర్) పవన కేంద్రాలను నెలకొల్పుతున్నారు. ఐరోపా దేశాలు ఇందులో ముందంజలో వున్నాయి. మన దేశంలో, ప్రత్యేకించి మన రాష్ట్రంలో చాలా విస్తీర్ణం తీరప్రాంతం వుంది. ఈ తీర ప్రాంతంలో ఆఫ్‌షోర్ విండ్ ఫార్మ్స్‌ను, వాయు వివరాలను నిర్ధారించిన తర్వాత వాటిని నెలకొల్పుకునే అవకాశాలు ఎంతగానో వున్నాయి.సౌరశక్తి వినియోగంలో కేవలం విద్యుదుత్పాదనే కాకుండా భవనాల పైన, భవనాల పైకప్పులపైనా (రూఫ్ టాప్స్) సోలార్ ప్యానల్స్‌ను నెలకొల్పడం ద్వారా ఎక్కడికక్కడ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. తక్కువ ఉష్ణోగ్రత గల ఐరోపా, అమెరికా దేశాలు కూడా ఈ రూఫ్ టాప్ సోలార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వీటితోపాటు, సోలార్ వాటర్ హీటర్లు, సోలార్ డ్రైయర్లు, సోలార్ కుక్కర్లు, సోలార్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుద్ధమైన నీటి తయారీకి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరూ సహకరించాల్సివుంది.

# నెల్లూరుదోమల వల్లే మోడీకి జపాన్‌లో రాచమర్యాదలు

అది ఢిల్లీ ఎయిర్‌పోర్ట్. ప్రధాని నరేంద్ర మోడీ అయిదు రోజుల జపాన్ పర్యటనకు బయలుదేరుతున్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, సదానందగౌడ, అనంత కుమార్‌లు ఆయనకు వీడ్కోలు పలకడానికి వచ్చారు. మోడీ విమానం ఎక్కుతూ వారికి రెండు చేతులతో కాకుండా నడుం, తల వంచి జపనీయుల శైలిలో వందనం చేసాడు. అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడుతో... సార్ ఏంటి కొత్తశైలిలో ప్రణామం చేస్తున్నారని అడిగాడు. వెంకయ్య ఉండి... సార్ వెళ్లేది జపాన్ పర్యటనకు కదా... ఐదురోజుల పాటు ఆయన అక్కడ అలాగే దండాలు పెడుతుండాలి. కాబట్టి ఇక్కడ నుండే అలవాటు పడుతున్నాడని చెప్పాడు. మోడీ లోపలకు పోవడంతో విమానం గాల్లోకి ఎగిరింది.

★★★★★

అది జపాన్ ప్రాచీన నగరం క్యోటో! ప్రధాని మోడీ విమానం అక్కడి ఎయిర్‌పోర్టులో దిగింది. విమానం దిగిన మోడీని, ఆయన బృందానికి సాక్షాత్తు జపాన్ ప్రధాని షింజో అబే స్వయంగా స్వాగతం పలికారు. ఏ విదేశీ అతిథికి కూడా జపాన్ ప్రధాని నేరుగా వచ్చి స్వాగతం పలికిన దాఖలాలు లేవు. కాని మోడీ విషయంలోనే అది జరిగింది. మోడీకి రెడ్‌కార్పెట్ పరిచారు. ఆయన రాకను జపనీయులు ఒక పండుగగా చేసుకుంటున్నారు. మోడీ రెండు రోజులు క్యోటోలో వుండి అక్కడి ఆలయాలను చూశారు. అక్కడ మూలకణ యూనివర్శిటీని సందర్శించారు. ఈ సందర్భంగా క్యోటో మేయర్ డైసాకు కడోకావాతో మోడీ సమావేశమయ్యారు. క్యోటో నగరం మాదిరిగానే మా వారణాసిని కూడా స్మార్ట్ హెరిటేజ్ సిటీగా మార్చుడానికి సహకరించాలని మోడీ కోరారు. దానికి డైసాకు కడోకావా వుండి... మీరేం అడిగినా మా ప్రధాని చేసేయమన్నారు. ఒక్క వారణాసి ఏంటి... మీ దేశంలో ఎన్ని నగరాలను స్మార్ట్ సిటీలుగా చేయాలో చెప్పండి, అన్నింటినీ మేమే చేసేస్తాం అని చెప్పాడు. క్యోటో మేయర్ స్పందనకు మోడీ ఆశ్చర్యపోయాడు. ఈయనేంటి ఒక నగరానికి సాయం కోరితే అన్ని నగరాలకూ చేస్తామంటాడు, ఇందులో ఏదన్నా మతలబు ఉందా? అనే ఆలోచనలో పడ్డాడు. తర్వాత క్యోటో పర్యటనను పూర్తి చేసుకుని మోడీ జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నాడు. అక్కడ ఓ చెరువులో ప్రధానులు మోడీ, షింజోఅబేలు చేపలకు ఆహారం వేస్తున్నారు. అప్పుడు మోడీ వుండి... మీరు చేపలకు ఆహారం వేస్తారు, మేం చేపలను ఆహారంగా తింటాం, మీకు మాకు ఇదే తేడా అని సరదాగా వ్యాఖ్యానించారు. అక్కడ నుండి బయలుదేరి ఇద్దరూ ప్రధాని కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఇద్దరి మధ్య చర్చలు మొదలయ్యాయి. మోడీ మాట్లాడుతూ... మా దేశ అభివృద్ధికి మీ సహాయసహకారాలెంతో అవసరం. మీ దేశంలో లాగే మా దేశంలోనూ బుల్లెట్‌రైళ్లు పెట్టాలనుకుంటున్నాం. అణువిద్యుత్ కావాలి, ఆధునిక రక్షణ ఆయుధాలు కావాలి అని కోరాడు. దానికి షింజోఅబే వుండి... అవన్నీ మీ దేశంలో వచ్చేలా చేస్తాం, ఒక ఏడాదిలోనే మీ దేశంలో బుల్లెట్ రైళ్లు తిరుగుతాయి, మీ దేశం మా దేశంలాగే తయారు చేసే పూచీ నాది అని హామీ ఇచ్చాడు. మళ్లీ మోడీ వుండి... గంగానది ప్రక్షాళనకు మీ సహకారం కావాలి. భారతదేశంలో మీ పెట్టుబడులు కావాలి, మీ ఆర్థిక సహకారంతోనే మేం పోర్టులు, పరిశ్రమలు స్థాపించాలని కోరాడు. అందుకు షింజో అబే స్పందిస్తూ... మా దేశం నుండి మీకు ఎన్ని విధాలుగా సహకారం కావాలో జాబితా వ్రాసివ్వండి, అవన్నీ మేం పూర్తి చేస్తాం. అది మా బాధ్యత అని చెప్పాడు. జపాన్ ప్రధాని సహకారానికి మోడీ ఆశ్చర్యపోయాడు. వీళ్లేంటి, ఇంత బాగా రియాక్టవుతున్నారు. అడిగినవే కాకుండా అడగనివి కూడా ఇస్తామంటున్నారు. మనపై ఇంత ప్రేమేందబ్బా అనుకుంటూ... సార్, మీరు మాకు ఇంతగా సాయం చేస్తున్నారు, ఇందుకు ప్రతిఫలంగా మా నుండి ఎన్ని కోట్లు ఆశిస్తున్నారు అని అడిగాడు. అందుకు షింజో అబే... మీరు ఒక్క నయాపైసా కూడా ఇవ్వొద్దు.. మీ దేశంలో ఈ పనులకు ఎన్ని లక్షల కోట్లయినా మేమే చేస్తాం, కాకపోతే ఒక టన్ను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను మాకివ్వండి చాలు... అని చెప్పాడు. ఓస్ ఇంతేనా... అదెంత పని అంటూ మోడీ జపాన్ పర్యటనను ముగించుకుని తిరుగుపయనమయ్యాడు. అయితే ఆయన విమానంలో కూడా... ఇంతగా మనకు సాయం చేస్తున్న జపాన్ మన నెల్లూరు ముదురు దోమలను ఏం చేసుకుంటుందబ్బా అని ఆలోచించసాగాడు.

★★★★★

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని మోడీ కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ ఓ వైపు కూర్చుని ఉన్నారు. వారికెదురుగా నెల్లూరు జంట ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్, మాజీఎమ్మెల్యే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64), మేయర్ అజీజ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, టీడీపీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ జడ్.శివప్రసాద్, కమిషనర్ శ్యాంసన్‌లు కూర్చుని ఉన్నారు. మోడీ వుండి తన జపాన్ పర్యటన విశేషాలను వివరిస్తూ... మనకు జపాన్ ఎంతగానో సాయపడుతుంది. అందుకు ప్రతిఫలంగా వాళ్లు ఒక టన్ను మీ నెల్లూరు ముదురుదోమలను కోరారు. ఇది చాలా చిన్న కోరిక. మీరు ఎలాగైనా ఓ టన్ను దోమలను జపాన్ పంపేలా చూడండని కోరాడు. వెంటనే వివేకా... వాటిని ఫ్రీగా ఎలా ఇస్తాం సార్, వాటిని పెంచడానికి ఎంత ఖర్చయిందో తెలుసా మీకు అని అడిగాడు. అందుకు అరుణ్‌జైట్లీ... మీరు దోమలు ఇస్తే దానికి ప్రతిఫలంగా మీ నెల్లూరు అభివృద్ధికి భారీగా నిధులిస్తామని ప్రతిపాదించాడు. అప్పుడు కోటంరెడ్డి లేచి... సార్, దోమలను ఇవ్వడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు, కాకపోతే ఆ తర్వాత మన దేశానికి అమెరికా, బ్రిటన్ దేశాలతో సంబంధాలు దెబ్బతింటాయని చెప్పాడు. ఆ మాటతో ప్రధానితో పాటు కేంద్రమంత్రులు కూడా అవాక్కయ్యారు. నెల్లూరుదోమలకు, అమెరికా, బ్రిటన్‌లతో సంబంధాలకు లింకు ఏంటని రాజ్‌నాథ్‌సింగ్ అడిగాడు. అప్పుడు కోటంరెడ్డి... చాలా బలమైన లింకే వుంది సార్, జపాన్ వాళ్లు చాలా తెలివైన వాళ్ళు. వాళ్లేం అమాయకులై మీరు కోరినవన్నీ చేస్తామని చెప్పలేదు. మనతో స్నేహసంబంధాలను పెంచుకుని అమెరికా, బ్రిటన్‌ల మీద కసి తీర్చుకోవాలనేది వాళ్ల ప్లాన్ అని చెప్పాడు. అదేంటి, మీరు చెప్పేది మాకేం అర్థం కావడం లేదని మోడీ అన్నాడు. దానికి శ్రీధర్‌రెడ్డి... ఇటీవలే 'పెరల్ హార్బర్' ఇంగ్లీష్ సినిమా తెలుగువెర్షన్‌లో చూసాను... రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు కలిసి జపాన్‌పై అణుబాంబులు వేసాయి, ఈ బాంబుదాడిలో హిరోషిమా, నాగసాకీ పట్టణాలు పూర్తిగా ధ్వంసం కావడమే కాక లక్షలాది మంది ప్రజలు మరణించారు. ఆ తర్వాత అమెరికా, బ్రిటన్‌లు బలమైన దేశాలుగా మారాయి. జపాన్ అన్ని విధాలా అభివృద్ధి చెందినా ఆ రెండు దేశాల మీద ప్రతీకారం తీర్చుకునే అవకాశం వారికి రాలేదు. ఇప్పుడు మనం ఒక టన్ను నెల్లూరు ముదురుదోమలను ఇచ్చామనుకోండి... వాటిని వాళ్లు ప్రయోగశాలల్లో పెట్టి కోట్లాది టన్నులుగా ఉత్పత్తి చేస్తారు. వాటిని రహస్యంగా అమెరికా, బ్రిటన్ దేశాలలో వదులుతారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత పదేళ్లకే జపాన్ కోలుకుంది. కాని ఈ దోమలను వదిలితే ఇక అమెరికా, బ్రిటన్‌లు ఈ భూమి వున్నంతవరకు కోలుకోలేవు. అణుబాంబులు పడ్డప్పుడు ప్రజలు ఒకే నిముషంలో మరణించారు. కాని ఈ దోమలను వదిలితే మనిషి ప్రతిరోజు ఛస్తూ బ్రతకాల్సిందే. అది పెద్ద నరకం. కాబట్టే అమెరికా, బ్రిటన్‌ల మీద ప్రతీకారం తీర్చుకోవడానికే వాళ్లు మన దోమలను అడిగారని అసలు విషయం చెప్పాడు. ఆ మాటలకు... జపాన్ వాళ్లు ఇందుకా నాకు అంతస్థాయిలో రాచమర్యాదలు చేసింది అంటూ మోడీ నోరెళ్లబెట్టాడు.

## కదంబం

## రాత్రంటే -

- కె.శివారెడ్డి

హైదరాబాద్. 040 - 24064195

రాత్రంటే భయం నాకు
అది ఏ ఆకారంలో వచ్చి
    నన్ను చుట్టుకుంటుందోనని -
ఏఏ కలల్ని మూటగట్టి
    నెత్తిమీద పెట్టి నడవమంటుందోనని -
రాత్రి కమ్మగా హాయిగా నిదరపోదామంటే
ఎవరో వచ్చి గోళ్లలో సూదులు గుచ్చుతారు.
నిర్ధాక్షిణ్యంగా కళ్ళు నరుకుతారు
ఇంత చలివెన్నెలనీ
దాని పక్కన జీరాడే మెత్తని చీకటినీ
పొదల్లో కదులుతున్న పిట్ట శబ్దాన్నీ
దిండు కింద దోపి, దిండులో ముఖంపెట్టి
నిర్భయంగా నిదరబోదామంటే -
శత్రువెవడో అప్పుడే యుద్ధానికి రమ్మంటాడు
రక్తం మీద సాక్షిగా సంధి
                చేసుకుందామంటాడు

చిన్నప్పుడెట్టా నిదరబోయేవాణ్ణో!
ఎత్తు తక్కువ చిన్న మంచం మీద
బొక్కబోర్లా పడుకుని - తల దగ్గర
దీపం పెట్టుకుని పుస్తకం తీస్తే -
తన్నుకొచ్చేది నిదర - ఒక పెద్ద ఏరులో -
నన్ను తుడిచి ఒక స్వర్గంలోకి
                విసిరేసేది
బండితోట్లో పడుకో, సావిట్లో పడుకో
నారుమడి పక్కన గనెం మీద పడుకో
నిదర భుజమెక్కి లోకాలన్నీ తిరిగొచ్చేవాణ్ణి
శీతాకాలం తెల్లారగట్ట లేవడం ఎంత కష్టం
చీకటి దుప్పటి తొలగించి
మా నాయనమ్మ బొజ్జలోంచి
    బయటకి రావడం ఎంత కష్టం
ఎవడో పిలుస్తాడు, మరెవడో పలుకుతాడు
పిలుపు - సమాధానాల మధ్య వేళ్లాడుతున్న
దణ్ణెం మీద నిదరని ఆరేసి -
లేచి పెడకడిలో చేయి పెట్టడం -
అయినా
పొద్దు పొడుస్తుందన్న ఆనందం
లోకం పరమానందంతో
పరమోద్విగ్నంగా ఊగి ఊగి పోతుందని -
దాని రెక్కల వాలు వెంట
అలా సుతారంగా జారిపోవచ్చని -

రాత్రికీ పగటికీ తేడా లేని
    ఒక దివ్యకాలం గడిచింది
రాత్రికీ పగటికీ తేడాలేని
ఎక్కడా చెమ్మలేని
ఒక దుర్భరకాలం గడుస్తోంది

# 21న 'కన్యాశుల్కం' పూర్తిస్థాయి నాటకం

## - 8 గంటల పాటు అరుదైన నాటక ప్రదర్శన -

సుప్రసిద్ధ రచయిత, సంఘసంస్కర్త మహాకవి గురజాడ అప్పారావు రచించిన ప్రసిద్ధమైన 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శనకు నెల్లూరు వేదికగా మారనుంది. ఈ నెల 21వ తేదీన నగరంలోని కస్తూర్భా కళాక్షేత్రంలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, 8 గంటల పాటు ఈ నాటకాన్ని ప్రదర్శించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రసిద్ధ నటీనటులతో ప్రదర్శించనున్న ఈ పూర్తిస్థాయి నాటకాన్ని చూడగలగడం ఒక అదృష్టమనే చెప్పాలి. ఈ నాటకం నాటి సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసింది. నాటికీ, నేటికీ కూడా సమాజాన్ని మేల్కొల్పే మహోన్నతమైన నాటకం ఇది. రంగస్థల రంగంలో మకుటాయమానమైన ఈ నాటకం మానవ జీవితంలోని అనేక కోణాలను అత్యంత అద్భుతంగా దృశ్యీకరిస్తుంది. నెల్లూరీయులకూ ఈ నాటకం సుపరిచితమే. అయితే, ఈ పూర్తి నాటకాన్ని చూడగలగడం మాత్రం ఎంతో అపురూపం. అంతటి సదవకాశాన్ని మనకు కల్పించేందుకు నెల్లూరులోని ప్రముఖులు కొందరు కన్యాశుల్యం నాటక కమిటీగా ఏర్పడి, ఆ నాటక ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 8 గంటల పాటు జరిగే ఈ నాటక ప్రదర్శన మధ్యలో రెండుసార్లు కొంత విరామ సమయం వుంటుంది. ప్రసిద్ధ నాటక సంస్థ విజయనగరం వారి 'నవ యువ ఆర్ట్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో, దర్శకులు శొంఠినేని కిషోర్, సమన్వయకర్త వెలుగు రామినాయుడుల నేతృత్వంలో ఈ నాటకం ప్రదర్శితమవుతుంది. ఈ నాటకంలో ఎంతో కీలకమైనది గిరీశం పాత్ర. ప్రముఖ రంగస్థల నటుడు అనిల్‌కుమార్ చెలికిచర్ల గిరీశం పాత్రను పోషించనున్నారు. అదేవిధంగా, రామప్పంతులు పాత్రలో పిఆర్‌జె పంతులు, మధురవాణిగా శ్రీమతి పి. మణిబాల, అగ్నిహోత్రావధానులుగా వివిఎస్ చలం, లుబ్ధావధానులుగా విఏ నాయుడు తమ పాత్రలను పాత్రోచితంగా పోషిస్తారు. ఈ నాటకం మానవజీవితమంత వాస్తవికమైనది.. విశాలమైనది అని, ఈ నాటకాన్ని గురజాడవారు రచించి నూరేళ్ళయినప్పటికీ నాటికీ–నేటికీ–ఏనాటికీ కూడా ఇది నిత్యనూతనంగా వెలుగొందుతోందని, తెలుగు ప్రజల గుండెల్లో ఈ నాటకం చిరస్థాయిగా నిలచిపోయిందని నాటక కమిటీ పేర్కొంది. కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించేందుకు నెల్లూరులో ఏర్పడిన సమన్వయ కమిటీకి గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షునిగా వేమిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్.సుధాకరరెడ్డి, డాక్టర్ బిపి చంద్రశేఖర్, కార్యదర్శిగా చలంచర్ల భాస్కరరెడ్డి, సహకార్యదర్శులుగా ప్రముఖ రచయిత కాళిదాసు పురుషోత్తం, సోంపల్లి ఆనందరావు, కోశాధికారిగా పిఎస్‌ఆర్ కోటిరెడ్డి, గౌరవ సలహాదారులుగా ఆచార్య ఆదిత్య, ఉడుతా కృష్ణయ్య, అల్లూరు లింగారెడ్డి నియమితులయ్యారు. ప్రముఖ వదాన్యుల సహకారంతో, కళాభిమానులందరి ఆశీస్సులతో ఈ పూర్తిస్థాయి నాటకం ప్రదర్శనకు ఏర్పాటు చేస్తున్నామని కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. నెల్లూరులోనూ ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని, ప్రజలందరూ చూడదగిన ఈ మహోన్నతమైన.. మహోజ్వలమైన నాటకాన్ని అందరూ తిలకించాలని వారు కోరుతున్నారు. అయినా.. నాటకాలంటే ఎంతో ఆసక్తితో.. తెల్లవార్లూ కంటిమీద కునుకులేకుండానైనా చూసి ఆనందించే నెల్లూరీయులకు ఇంతకన్నా సంతోషించదగ్గ విషయం ఏముంటుందీ!..అందులోనూ ఎంతో సుప్రదసిద్ధమైన 'కన్యాశుల్కం' పూర్తిస్థాయి నాటకాన్ని చూసే ఇంత మంచి అవకాశాన్ని ఎవరైనా సరే ... ఎందుకు వదులుకుంటారూ?!..

# తెలుగింటి లోగిళ్ల.. 'బొమ్మలకొలువు' బాపు



*బాపు గీసిన బొమ్మలు.. రాసిన రాతలు అపూర్వం.. అద్భుతం! ఆయన మృతితో.. ఈ చిత్రవిచిత్ర జీవిత యవనిక పైనుంచి ఒక ప్రఖ్యాత కళాకారుడు అందరూ చూస్తుండగానే.. కనుమరుగైనట్లయింది. అందమైన కాన్వాసు మీంచి అర్ధాంతరంగా ఒక బొమ్మ చెదిరిపోయినట్లయింది. అయినా!.. బాపు ఇక లేరనుకోగలమా?..*

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు సమున్నతమైన ప్రతీకగా... తెలుగుతనానికి నిలువెత్తు పతాకగా రెపరెపలాడిన విఖ్యాత చిత్రకారుడు.. బాపు.. ఇక లేరనుకోవడం నిజంగా ఎంతో బాధగా వుంది. తెలుగిళ్ళ లోగిళ్లలో అందమైన బొమ్మలకొలువును పెట్టి, అందరినీ ఇంత కాలం తన రేఖావిన్యాసాలతో సంతోషపెట్టి..ఆయన మాత్రం ఓ యోగిగా.. నింపాదిగా తనపాటికి తాను తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లిపోయారు. బాపు.. లేకపోయినా, ఆయన వేసిన బొమ్మలు మాత్రం తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోతాయి. ఎవరి హృదయాలను తడిమిచూచినా ఆ ముగ్ధమనోహరమైన చిత్రాలు మన మనోఫలకాలపై కదులాడుతాయి. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన గీసిన బొమ్మలతో పాటు, ఆయన ముఖచిత్రం కూడా మనందరి గుండెల్లో నిండిపోయే వుంటుంది. చిత్రకళలో సాటిలేని మేటిగా రాణిస్తూ, చిత్రకళారంగంలో తెలుగువారికి, తెలుగు నేలకు ఎనలేని ఖ్యాతిని.. విఖ్యాతిని తెచ్చిపెట్టిన ప్రఖ్యాత చిత్రకారులాయన. దేవతామూర్తుల చిత్రాలు వేసినా, నాయికానాయకుల బొమ్మలు వేసినా, పుస్తకాలకు ముఖచిత్రాలు వేసినా, చివరికి సరదాగా కొంటెబొమ్మలు గీసినా వేటి ప్రాముఖ్యత వాటిదే. కొంటెబొమ్మలు, కార్టూన్లు వేస్తే అవి ఎంతగా నవ్వు పుట్టించేవో తెలుగు వారందరికీ అనుభవైకవేద్యమే. ఎంతో సౌకుమార్యంతో, వయ్యారంగా నిలుచున్న యువతుల బొమ్మలను ఆయన క్షణాల్లోనే గీసేవారు. చారడేసి కళ్లు..కోటేరులాంటి ముక్కు. ఎంతో అందంగా, చూడముచ్చటగా వుండే బాపు బొమ్మలంటే తెలుగు వారి గుండెల్లో కొలువుదీరిన బొమ్మల కొలువులాంటిదేనని చెప్పవచ్చు. ఆ బొమ్మ ఎవరు వేశారని అనుకోకుండానే.. 'అది బాపు వేసిన బొమ్మ' అని ఎవరైనాసరే..ఇట్టే చెప్పేయగలరంటే అతిశయోక్తి కాదు. మానవ జీవితయానంలోని ఎన్నో రకాలైన కోణాలను, మనోభావాలను బాపు తనదైన శైలిలో అత్యద్భుతంగా ఆవిష్కరించారు. క్రౌర్యం, కారిన్యం, భీభత్సం, భయానకం, శోకం, ఆనందం, ఆగ్రహం, రౌద్రం, కరుణ..ఇలా ఎన్నో రకాలైన భావాలను ఒక్క గీతతోనే ఆవిష్కరించగల మహా మేధావి ఆయన. అందుకే, బాపూ వేసిన బొమ్మలు అంతటి ప్రఖ్యాతిని పొందాయి. బాపు వేసిన బొమ్మల్లాగా..రెండు జడల సీతలాగా వుండాలని యువతులు ఎంతో ఆరాటపడిన రోజులూ వున్నాయి. ఆయన గీత, రాత కూడా ఎంతో ప్రసిద్ధమైనవి. చిత్రకళలో అనితరసాధ్యమైన రీతిలో, ఎంతో సరళమైన రేఖల్లో.. ప్రత్యేకమైన శైలీవిన్యాసంతో ఆయన వేసిన బొమ్మలు తెలుగువారి గుండెల్లో ఇట్టే నిలచిపోయాయి. తమ పుస్తకానికి బాపు ఓ బొమ్మ వేస్తే చాలు..అదే పదివేలు?.. అనుకునే వారు రచయితలు, కవులు, గ్రంథకర్తలు. బాపు ఏ బొమ్మ వేసినా దేనికదే విశిష్టత సంతరించుకోవడం ఆయన ప్రత్యేకత. ఎంతో ముచ్చటగా వుండే ఆయన అక్షరాలు 'బాపు ఫాంట్'గా ఎంతో ప్రసిద్ధిచెందడం బాపు ప్రత్యేకతకు మరో నిదర్శనం. ఆయనో చిత్రకళా యోగి. జీవితమంతా చిత్రకళగా, చిత్రకళే జీవితంగా జీవితాంతం జీవించారాయన. అటు చిత్రకళా రంగంలోనూ, ఇటు సినీరంగంలోనూ అపారమైన ప్రజ్ఞాపాటవాలతో రాణించారు. బాపు అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. ఆయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సమీపంలోని కంతేరు అనే గ్రామం. 1933 డిసెంబరు 15వ తేదీన నిడమోలులో అమ్మమ్మ ఇంట్లో ఆయన జన్మించారు. పదిహేనేళ్ళ వయసులోనే కుంచె చేతపట్టి చిత్రాలు వేయడం ప్రారంభించిన బాపు, అనతి కాలంలోనే చిత్రకళారంగంలో సమున్నతమైన స్థానానికి ఎదిగారు. సినీరంగంలో ప్రవేశించి ప్రఖ్యాత దర్శకునిగా వుంటూ తెలుగు సినీ వినీలాకాశంలో నూతన చంద్రోదయంగా నిలచి మరిన్ని వెలుగులు అందించారు. ముత్యాలముగ్గు, బుద్ధిమంతుడు, సంపూర్ణ రామాయణం, అందాల రాముడు, భక్తకన్నప్ప, మనవూరి పాండవులు వంటి ప్రఖ్యాతమైన చిత్రాలతో పాటు, మొన్నటి శ్రీరామరాజ్యం చిత్రం దాకా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 51సినిమాలకు బాపు దర్శకత్వం వహించి ప్రఖ్యాతి చెందారు. అయిదుసార్లు నంది అవార్డులు, రెండుసార్లు జాతీయపురస్కారాలు అందుకున్నారు. 1986లోనే ఆయనకు విశిష్టమైన రఘుపతి వెంకయ్య అవార్డు లభించింది. 2013లో భారత ప్రభుత్వం బాపుకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ బిరుదునిచ్చి సత్కరించింది. ఏదేమైనా బాపు మృతితో తెలుగిళ్ళు శోకసంద్రంలో మునిగిపోయాయి. అశేష జనవాహిని కన్నీటి నివాళుల మధ్య, చిత్ర కళారంగం, సినీరంగం కన్నీరు మున్నీరై విలపిస్తుండగా, చెన్నైలో మంగళవారం బాపు పార్థివ దేహానికి అంతిమ సంస్కారాలు జరిగాయి.

## బాపుతో..'లాయర్' అనుబంధం

సుప్రసిద్ధ చిత్రకారుడైన బాపుతో 'లాయర్'కు అనుబంధం వుంది. 2006లో లాయర్ వార పత్రిక రజతోత్సవ ప్రత్యేక సంచిక 250 పేజీలతో సర్వాంగసుందరంగా వెలువడిన విషయం పాఠకులందరికీ తెలిసిందే. సాహితీసీమగా పేరుగాంచిన సింహపురి సీమలోని సారస్వత విశేషాలతో ఎంతో అందంగా ముద్రితమైన ఈ ప్రత్యేకసంచిక బాపుగారు అత్యద్భుతంగా వేసిన ముఖచిత్రంతో వెలువడడం 'లాయర్'కు గర్వకారణం. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహాకవి తిక్కన, అల్లంతదూరంలో శ్రీ రంగనాథుని కోవెల, చుట్టూ పచ్చని వరిచేలు.. శ్రీకృష్ణుడు అర్జునునికి గీతను బోధిస్తున్న దృశ్యం వగైరాలన్నిటినీ ఎంతో సుందరంగా చిత్రించారాయన. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగివుండే నిరాడంబర వ్యక్తిత్వం ఆయనది. ఆ సౌజన్యమూర్తి.. ఇక లేరని అనుకోలేకపోతున్నాం. మనందరి హృదయాల్లో ఆయన వున్నారు. చిరస్థాయిగా.. చిరంజీవిగా వుంటారు కూడా.



## నెల్లూరీయులతో బంధం...

చెన్నైలోని ఎంతోమంది నెల్లూరు తెలుగోళ్ళకి "బాపు" సుపరిచితుడే. ముఖ్యంగా డా॥ సి.యం.కె.రెడ్డి కుటుంబానికి "బాపు" ఆత్మబంధువు. అంతేకాకుండా 1980లో విడుదలై ప్రముఖ బాలీవుడ్ నటుడు అనిల్‌కపూర్‌కి సినీజీవితాన్ని పరిచయం చేసిన తొలిచిత్రం "వంశవృక్షం" నెల్లూరోళ్ళది కావడం విశేషం.

మూళ్ళపూడి వెంకటరమణ రచించిన కథకి "బాపు" దర్శకత్వం వహించగా నెల్లూరోళ్ళు గునపాటి హరిశ్చంద్రారెడ్డి, ఆదాల రాఘవరెడ్డి ఈ సినిమాకి నిర్మాతలుగా వ్యవహరించారు. వంశీకృష్ణా మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రం విడుదలైంది.

# రాజధాని 'విజయ'వాడే

(మొదటిపేజీ తరువాయి)

13జిల్లాల ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చంద్రబాబు రాజధాని ప్రకటన చేశారు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌పార్టీ ఎటువంటి రాజకీయ ప్రయోజనాలకు పాల్పడిందో చంద్రబాబు కూడా అదే రాజకీయ ప్రయోజనాల దృష్టితో రాజధాని ప్రకటన చేశాడు. ఆయన పార్టీకి కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఎక్కువ సీట్లు వచ్చాయి కాబట్టి అక్కడే రాజధాని పెట్టాలని ఆయన ముందుగానే నిర్ణయించేసుకున్నాడు. అయితే రాజధాని ఎంపికపై కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ మాత్రం విజయవాడ-గుంటూరుల మధ్య రాజదాని పెడితే వచ్చే సమస్యలను సమగ్రంగా వివరిస్తూ కేంద్రానికి నివేదిక ఇచ్చారు. తెలుగుదేశం నాయకులు ఆ నివేదికను తప్పుపట్టడమే కాక కమిటీ సభ్యుల మీద తలతిక్క విమర్శలు చేశారు. శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చించాలన్న ప్రతిపక్ష విజ్ఞప్తిని కూడా చంద్రబాబు ఖాతరు చేయకుండా రాజధానిపై నిర్ణయం తీసుకున్నాడు.

రాష్ట్ర విభజన విషయంలో యూపిఏ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా వ్యవహరించిందో రాజధాని ఎంపిక విషయంలోనూ ఈ రాష్ట్ర ప్రభుత్వం అదే నియంతృత్వ ధోరణిని ప్రదర్శించింది. రాజకీయ స్వార్థం కోసం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడంలో ఎవరికి ఎవరూ తీసిపోరని చంద్రబాబు నిరూపించాడు. ప్రజాస్వామ్యానికి వేదికయిన అసెంబ్లీలో రాజధానిపై చర్చను చేపట్టకుండానే రాజధానిని ప్రకటించడం ద్వారా చంద్రబాబు చరిత్రలో చెరిగిపోని తప్పు చేశాడు.

# జగన్‌లో తగ్గని వేడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్షంగా చూసిన ప్రజలు అధికారపక్ష శైలినే తప్పుపడుతున్నారు. ప్రజలు జగన్‌ను సమర్థించడానికి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడానికి ఇంకో కారణం ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన ఏ ఒక్క వాగ్దానం కూడా ఇప్పటికీ అమలు చేయకపోవడమే! ఈ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడం కోసమే తెలుగుదేశం జగన్‌ను బలహీనపరచాలనుకుంటుంది. జగన్‌ను అశక్తుడిని చేయడం ద్వారా వైకాపా ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి లాగాలనుకుంటున్నారు. అయితే ప్రతిపక్షనేతగా జగన్ అందరూ ఊహించిన దానికంటే గట్టిగా నిలబడ్డాడు. తనపై అధికారపక్షం ఎంతగా దాడికి దిగుతున్నా ఎంత మాత్రం వెనుకకు తగ్గకుండా ప్రతి దాడి చేస్తున్నాడు. దాంతో అధికారపక్షం ఆటలు సాగడం లేదు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com